# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
4-8-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 132

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## బిజెపిలోకి డీకే శివకుమార్?!

కమలం పార్టీకి దగ్గరవుతున్న కర్ణాటక ముఖ్యమంత్రి

కాంగ్రెస్ పార్టీలో కొత్త చర్చ

రేవంత్ విషయంలో కూడా గతంలో అలానే

కొట్టిపారేస్తున్న కాంగ్రెస్ వర్గాలు


**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:**

కేంద్ర ప్రభుత్వ సహకారం లేనిది ఏ రాష్ట్రం అభివృద్ధి చెందదు. ఈ విషయం తెలుసు కాబట్టి చాలామంది విపక్ష ముఖ్యమంత్రి సైతం ఇప్పుడు కేంద్ర ప్రభుత్వంతో సన్నిహిత సంబంధాలు నడుపుతున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ ముఖ్యమంత్రి ఈ విషయంలో ముందున్నారు. మొన్నటికి మొన్న తెలంగాణ సీఎం రేవంత్ ప్రధాని నరేంద్ర మోడీనీ పొగడ్తలతో ముంచేత్తారు.

2లో

## కాంగ్రెస్‌లో 'నామినేటెడ్' చిచ్చు!

కాంగ్రెస్ పార్టీలో ఒక రకమైన అసంతృప్తి కనిపిస్తోంది. సీనియర్ ఎమ్మెల్యేల్లో మంత్రివర్గ విస్తరణ పై అసంతృప్తి ఉండగా.. ద్వితీయ శ్రేణి నాయకత్వం మాత్రం నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయడం పై రగిలిపోతోంది. అయితే ఈ విషయంలో పార్టీ హై కమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కానీ ఎందుకో రాష్ట్ర నాయకత్వం తీవ్ర జాప్యం చేస్తోంది. దీంతో క్యాడర్లో అసహనం పెరుగుతోంది. త్వరలో ప్రాదేశిక ఎన్నికలకు సిద్ధపడుతున్న తరుణంలో.. కాంగ్రెస్లో అసహనం కనిపిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.




నామినేటెడ్ పదవుల భర్తీలో తీవ్ర జాప్యం

పార్టీ హై కమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా..

రాష్ట్ర నాయకత్వం వెనుకడుగు

హస్తం పార్టీలో పెరుగుతున్న అసంతృప్తి

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో**

భర్తీకి గ్రీన్ సిగ్నల్.. ఇటీవల కాంగ్రెస్ హై కమాండ్ నామినేటెడ్ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు ప్రచారం నడిచింది. సీఎం రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో

- మిగతా 3వ పేజీలో



## ఇక పీకే శకం!

బాంకీపూర్ బై పోల్‌లో ప్రశాంత్ కిషోర్ సూపర్ విక్టరీ

బిజెపికి బలమైన స్థానంలో భారీ విజయం

బీహార్ రాజకీయాల్లో కుదుపు

2లో



## డీ లిమిటేషన్‌పై కాంగ్రెస్ డేంజర్ గేమ్!

మద్దతు తెలిపే పార్టీలను 21వ శతాబ్దపు ద్రోహులుగా అభివర్ణించిన రాహుల్ గాంధీ

తమిళలపై జరుగుతున్న దాడిగా చిత్రీకరణ

## జెన్ జీతో బిజెపి గ్రాఫ్ తగ్గిందా?!

సంబరాలు చేసుకుంటున్న విపక్షాలు

రాజకీయం మరక అంటకుండా ఉద్యమం

ఎన్డీఏ అప్రతిహస విజయాలకు బ్రేక్

అన్ని రాజకీయ పార్టీలకు ఇది హెచ్చరిక

2లో

దేశవ్యాప్తంగా బిజెపి గ్రాఫ్ తగ్గుతోందా? కాక్రోచ్ జనతా పార్టీ పేరుతో జరిగిన ఉద్యమం బిజెపిని పలుచన చేసిందా? ఎన్డీఏకు ఎదురు దెబ్బ ఖాయమా? పొలిటికల్ సర్కిల్స్ లో దీని పైనే చర్చ నడుస్తోంది. భారత రాజకీయాల్లో ఎప్పటి వరకు జరిగిన ప్రజా పోరాటాలు వేరు. రాజకీయ పార్టీలతో పాటు విద్యార్థి సంఘాల అనుబంద విభాగాలు సంప్రదాయ శైలిలో తమ పోరాటాలు చేసేవి. కానీ దేశ చరిత్రలో తొలిసారిగా ఎలాంటి రాజకీయ జెండాలు, అనుబంధ గుర్తులు లేకుండా.. కేవలం తమ భవిష్యత్తు కోసం కాక్రోచ్ జనతా పార్టీ పేరుతో జెన్ యువత సాధించిన విజయం సరికొత్త అధ్యాయం.



**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:**

అయితే ప్రతిపక్ష పార్టీలకు ఈ ఉద్యమం ఒక వరంగా మారింది. అప్రతిహాసవిద్యాలతో ముందుకు వెళుతున్న నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్డీఏకు ఇది ఒక్క చెంపపెట్టు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్



## మల్లారెడ్డి త్రిబుల్ గేమ్!

మూడు పార్టీలతో ఆడుకుంటున్న సీనియర్ నేత


ఉండేది బిఆర్ఎస్‌లో..

బిజెపితో పాటు కాంగ్రెస్ తో స్నేహం

సేఫ్ జోన్ వ్యూహం

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణ రాజకీయాల్లో మల్లారెడ్డి స్థాయి ప్రత్యేకం. ఆయన గత కొద్ది రోజులుగా వ్యవహరిస్తున్న తీరు అనుమానాస్పదంగా ఉంది. అంతకుమించి ఆసక్తికరంగా ఉంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు.



2లో



జార్ఖండ్‌లో పబ్లిక్ సర్వీస్ కమిషన్

## పేపర్ లీక్

సమగ్ర విచారణ జరపాలంటూ విద్యార్థుల డిమాండ్

నిరాహారదీక్షకు దిగిన విద్యార్థులు..మద్దతుగా ఆందోళన

ఆందోళనకు మద్దతు తెలిపన కాక్రోచ్ నేత అభిజిత్ దీప్కే

## నిరుద్యోగులను మోసం చేసిన రేవంత్

ఉద్యోగాల భర్తీ పేరుతో ఆటలాడుకున్నారు

నిరుద్యోగ నియామకాలు, భృతి హామీల విస్మరణ


యువత ఆందోళనలను పట్టించుకోని కాంగ్రెస్

మీడియా సమావేశంలో మండిపడ్డ బిఆర్ఎస్ నేత కెటిఆర్



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** : రాష్ట్రంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను సిఎం రేవంత్ రెడ్డి పూర్తిగా విస్మరించారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. యూత్ డిక్లరేషన్ పేరిట ప్రచారంతో కాంగ్రెస్ ఊదరగొట్టిందని విమర్శించారు. జాబ్‌లు భర్తీ చేయకపోవడంతో ఓ యువకుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. ఈ మేరకు సోమవారం

- మిగతా 3వ పేజీలో



# ఇక పీకే శకం!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** ప్రశాంత్ కిషోర్ వ్యూహం విజయవంతం అయ్యింది. స్వరాష్ట్రం బీహార్లో ఆయన అసెంబ్లీలో అడుగుపెట్టారు. ప్రతిష్టాత్మకమైన బాంకీపూర్ ఉప ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. ఎన్నికల వ్యూహకర్తగా వేరువేరు పార్టీలను గెలిపించిన చరిత్ర ఆయనది. కానీ ప్రత్యక్షంగా బరిలో దిగితే ఓడిపోతారని ప్రచారం చేసిన విమర్శకుల నోళ్లను ఎట్టకేలకు మూయించగలిగారు. అధికార బిజెపికి ఎదురులేని స్థానమైన పాట్నాలోని బాంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో గ్రాండ్ విక్టరీ సాధించారు. పక్షపాతాల్లేని సరికొత్త రాజకీయ సంస్కృతి తెస్తానంటూ జన సురాజ్ పార్టీ తరపున ఆయన సాధించిన విజయం బీహార్ లోనే మాత్రమే కాదు.. యావత్తు దేశ రాజకీయాల్లో సంచలనంగా మారింది.

**అసెంబ్లీ ఎన్నికల్లో నిరాశ..**

ఎన్నికల వ్యూహకర్తగా ఉన్న ప్రశాంత్ కిషోర్ తన స్వరాష్ట్రం బీహార్లో సొంత రాజకీయ పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. చాలా రోజులుగా సన్నాహాలు ప్రారంభించారు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రశాంత్ కిషోర్ పోటీకి దూరంగా ఉంటూ.. క్షేత్రస్థాయిలో పార్టీ విస్తరణ పై దృష్టి సారించారు. కానీ అసెంబ్లీ ఎన్నికల్లో కనీస స్థాయిలో కూడా ఉనికి చాటుకోలేకపోయారు. దీనిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. కానీ అనుకోని విధంగా బంకిపూర్ నియోజకవర్గ బై పోల్ కలిసి వచ్చింది. ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిచిన సీనియర్ నేత నితిన్ నబీన్ జాతీయ బిజెపి అధ్యక్ష పదవితో పాటు రాజ్యసభకు ఎన్నికయ్యారు. దీంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యంగా మారింది. ఇది బిజెపికి బలమైన స్థానం. అయినా సరే ప్రశాంత్ కిషోర్ అసెంబ్లీలో అడుగు పెట్టాలన్న కసితో పని చేశారు. నేరుగా పోటీ చేసి విజయం సాధించారు.

**మూడు దశాబ్దాలుగా బిజెపి కోట..**

1995 నుంచి దాదాపు మూడు దశాబ్దాలుగా బిజెపికి నియోజకవర్గం తిరుగులేని కోట. అటువంటి చోట ప్రశాంత్ కిషోర్ బరిలో దిగడంతో.. బిజెపి ఆలోచనలో పడింది. ప్రశాంత్



కిషోర్ వ్యూహాలు, జన సురాజ్ పార్టీ దూకుడు చూసి ఎప్పటికప్పుడు అభ్యర్థులను మార్చుతూ.. చివరిగా సాదాసీదా అభ్యర్థి నీరజ్ కుమార్ రంగంలోకి దించింది. బిజెపి గెలుపు కోసం ఆ పార్టీ మంత్రులతో పాటు సీనియర్ నేతలు రంగంలోకి దిగారు. కానీ క్షేత్రస్థాయిలో ప్రజలు ప్రశాంత్ కిషోర్ వ్యక్తిత్వానికి మొగ్గు చూపారు. కుల, మత సమీకరణలకు అతీతంగా విద్యావంతుడు, మార్పు తీసుకురాగల నేతగా ప్రశాంత్ కిషోర్ ను నమ్మి పాట్నా ప్రజలు ఆయనకు విజయాన్ని అందించారు.

**అదే దూకుడుతో..**

దేశంలో ఎన్నో రాజకీయ పార్టీలకు వ్యూహకర్తగా సేవలు అందించారు ప్రశాంత్ కిషోర్. ప్రధాని నరేంద్ర మోడీ తొలిసారిగా ప్రశాంత్ కిషోర్ సలహాలతోనే గెలవగలిగారు. అయితే ప్రశాంత్ కిషోర్ ఖాతాలో గెలుపు తో పాటు అపజయాలు ఉన్నాయి. అయితే ఎవరికోసమో ఎందుకు తనకోసం తాను వ్యూహాలు రూపొందించుకున్నారు పీకే. రాజకీయ వ్యూహ కర్త పదవి నుంచి పరిపూర్ణ రాజకీయ నాయకుడిగా మారే క్రమంలో ఆయన తడబడ్డారు. బీహార్లో పాదయాత్ర చేసిన అక్కడి ప్రజలు ఆదరించలేదు. అయితే ఎక్కడా వెనక్కి తగ్గలేదు ప్రశాంత్ కిషోర్. కొడితే కుంభస్థలాన్ని కొట్టాలని భావించిన ఆయన.. బిజెపికి ఎంతో బలమైన స్థానమైన బాంకిపూర్ స్థానంపై గురుపెట్టారు. తాను అనుకున్నది సాధించి గ్రాండ్ విక్టరీ అందుకున్నారు. బీహార్ రాజకీయాల్లో ప్రశాంత్ కిషోర్ శకం మొదలయింది అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# డీ లిమిటేషన్‌పై కాంగ్రెస్ డేంజర్ గేమ్!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్** డెస్క్: దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పెంపు కాంగ్రెస్ పార్టీకి ఇష్టం లేదా? అలా చేస్తే బిజెపికి మరోసారి అధికారం దక్కడం ఖాయమా? అందుకే రాహుల్ గాంధీ విమర్శలు చేస్తున్నారా? డీ లిమిటేషన్ కు మద్దతు ఇచ్చే పార్టీలు 21వ శతాబ్దపు ద్రోహులు అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు వెనుక ఉన్న మర్మం అదేనా? ఇప్పుడు పొలిటికల్ సర్కిల్స్ లో దీని పైనే చర్చ నడుస్తోంది. తమిళనాడు పర్యటనలో రాహుల్ గాంధీ చేసిన కామెంట్స్ ఇప్పుడు చర్చకు దారితీస్తున్నాయి. ఉద్దేశపూర్వకంగా విభజన రాజకీయాలను రెచ్చగొట్టేలా ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రాంతీయ సెంటిమెంట్లను రగిలించే కుట్రగా అభివర్ణిస్తున్నారు.

**కేంద్రం విస్తృత సంప్రదింపులు..**

ప్రతి రాష్ట్రంలో ఇప్పుడున్న అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాలు 50% పెంచేలా.. ప్రతి రాష్ట్రానికి సమానంగా ఈ ప్రాతిపదిక వర్తించేలా కేంద్ర ప్రభుత్వం విస్తృతమైన సంప్రదింపులు చేసేందుకు సిద్ధపడుతోంది. దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణలో సాధించిన విజయాలను దృష్టిలో ఉంచుకొని.. ఏ రాష్ట్రానికి సీట్ల ప్రాతినిధ్యం తగ్గకుండా ప్రత్యేక ఫార్ములాను అమలు



చేయాలని అందరూ భావిస్తున్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఈ ప్రతిపాదనను సాహేతుకంగా చర్చించి ఓ కొలిక్కి తెచ్చేందుకు సుముఖంగా ఉన్నట్లు పరిస్థితి అర్థం అవుతోంది. కానీ రాహుల్ గాంధీ మాత్రం ఈ ప్రక్రియ మొత్తాన్ని తమిళులపై దాడి అని అభివర్ణిస్తూ నిప్పు రాజేసే ప్రయత్నం చేస్తుండడం పై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

**బాధ్యతాయుతమైన పదవిలో ఉండి..**

రాహుల్ గాంధీ ఒక బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నేత. ఆయన డిలిమిటేషన్ ను వ్యతిరేకిస్తున్నారు. కానీ అందుకు ప్రత్యామ్నాయ పరిష్కార మార్గాన్ని మాత్రం సూచించడం లేదు. రేపు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే జనాభా ప్రాతిపదికన మాత్రమే సీట్లను విభజిస్తారా? లేకుంటే ఇప్పుడున్న స్థానాల నిష్పత్తి కంటే ఎక్కువ దక్షిణాదికి ఇస్తారా? లేకుంటే ఉత్తరాది సీట్లను తగ్గించి ఇతర ప్రాంతాలకు కేటాయిస్తారా? అనే విషయాలపై మాత్రం మాట్లాడటం లేదు. ఈ విషయంలో మాత్రం రాహుల్ గాంధీ తీరుపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ ఎక్కువగా సెంటిమెంట్లను రగిలించి రాజకీయంగా చలికాచుకోవాలని చూస్తోంది. నియోజకవర్గాల పునర్విభజన అనేది రాజ్యాంగంలోని అధికరణలు 82, 170 ప్రకారం జరగాల్సిన ప్రక్రియ. జనాభా పెరుగుదల నిష్పత్తిని సమతుల్యం చేసుకుంటూ.. అభివృద్ధి చెందిన దక్షిణాది రాష్ట్రాల హక్కులకు భంగం కలగకుండా సమగ్ర మార్గదర్శకాలను రూపొందించుకోవడం ప్రజాస్వామ్య పద్ధతి. ఒక బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నేత ఆరోగ్యకరమైన చర్చకు సహకరించకుండా.. కేవలం భయాందోళనలు సృష్టించి ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడం అనేది నిజంగా సహేతుకం కాదు. కాంగ్రెస్ ట్రాప్ లో ఇతర రాజకీయ పార్టీలు పడితే మాత్రం.. దేశంలో ప్రాంతీయ అసమానతలు, ఉద్రిక్తతలు తలెత్తే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# మల్లారెడ్డి ట్రిబుల్ గేమ్!

అధికార కాంగ్రెస్ పార్టీ నేతలతోనూ.. బిజెపి అగ్ర నేతలతోనూ ఆయన జరిపిన భేటీలతో రాజకీయంగా కలకలం రేపారు. మల్లారెడ్డి పార్టీ మారడం ఖాయం అనే ప్రచారం కూడా సాగింది. అయితే భారత రాష్ట్ర సమితికి గుడ్ బై చెప్పనని మాత్రం చెప్పడం లేదు. ఆ పార్టీలో ఉంటానని చెబుతూనే అంటి ముట్టనట్టుగా ఉండడం.. డబుల్ గేమ్ ఆడుతున్నట్లు స్పష్టం అవుతోంది.

**కేటీఆర్ జన్మదిన వేడుకల్లో..**

కేటీఆర్ జన్మదిన వేడుకల సందర్భంగా మల్లారెడ్డి వ్యవహార శైలి మరోసారి హాట్ టాపిక్ అవుతోంది. బోయిన్పల్లి లోని తన కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. తాను భారత రాష్ట్ర సమితిలోనే ఉంటానని స్పష్టం చేశారు. అయితే అక్కడ ఉన్న పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. కేటీఆర్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న మల్లారెడ్డి మెడలో గులాబీ కండువా ఉన్నప్పటికీ.. వాటిపై ఎలాంటి పార్టీ గుర్తులు లేవు. సాధారణంగా కనిపించే జెండాలు.. కెసిఆర్ తో పాటు కేటీఆర్ భారీ కటౌట్లు లేకుండా.. ఒక సాధారణ శుభాకాంక్షలు బోర్డుతోనే సరిపెట్టడం అనుమానాలకు తావిస్తోంది. భారత రాష్ట్ర సమితి పార్టీని వీడే ఆలోచన లేదని చెబుతున్నా.. ఈ పరిణామాలన్నీ చూస్తుంటే మాత్రం రోజురోజుకు పరిణామాలు పెరుగుతున్నాయి.

**పార్టీ కార్యకర్త లేఖతో**

ఇటీవల మల్లారెడ్డి వ్యవహార శైలిని వ్యతిరేకిస్తూ ఓ గులాబీ పార్టీ కార్యకర్త తన రక్తంతో లేఖ రాయడం పెద్ద కలకలం రేపింది. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అన్ని పదవులు, అవకాశాలు అనుభవించి.. ఇప్పుడు ప్రతిపక్షంలోకి రాగానే.. పార్టీని విడిచి పెట్టడం సరికాదని సదరు కార్యకర్త తన లేఖలు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో గులాబీ పార్టీ శ్రేణుల్లో తనపై వ్యతిరేకత




పెరుగుతోందని గ్రహించిన మల్లారెడ్డి.. ఆ రక్తపు లేఖ పై స్పందిస్తూ తనకు పార్టీ మారే ఉద్దేశం లేదని.. ఆ లేఖ రాసిన కార్యకర్తను స్వయంగా కలిసి మాట్లాడతానని వివరణ ఇచ్చుకున్నారు.

**ఆ రెండు పార్టీలతో స్నేహంగా..**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, దేశంలో అధికారంలో ఉన్న బిజెపితో స్నేహభావంతో కొనసాగుతున్నారు మల్లారెడ్డి. గతంలో తన కోడలతో కలిసి బిజెపి అగ్రనేతలను కలిశారు. వచ్చే ఎన్నికల్లో తన కోడలు బిజెపి తరఫున పోటీ చేయిస్తారని అప్పట్లో ప్రచారం నడిచింది. మొన్నటికి మొన్న సీఎం రేవంత్ సభకు హాజరయ్యారు. కెసిఆర్ పై రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్న అభ్యంతరం వ్యక్తం చేయలేదు. ఇప్పుడు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించి.. ట్రిబుల్ గేమ్ ఆడుతున్నారు. తనను తాను సేఫ్ గా ఉండేందుకు ఈ సరికొత్త పొలిటికల్ గేమ్ ఆడుతున్నట్లు అర్థం అవుతోంది. మరి మున్ముందు దీనికి ఎలా ముగింపు పలుకుతారో అనే చర్చ నడుస్తోంది.

# జార్ఖండ్‌లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీక్

రాంచీ,ఆగస్ట్: నీట్ పేపర్ లీక్ నిరసనలతో కొన్నిరోజుల క్రితం దేశ రాజధాని ఢిల్లీ ఉద్రిక్తంగా మారగా.. ఇప్పుడు ఝార్ఖండ్‌లో అదే పరిస్థితి కనిపిస్తోంది. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రిలిమినరీ పరీక్షలో అవకతవకలు చోటుచేసుకున్నాయని రాజధాని నగరం రాంచీలో ప్రారంభమైన ఆందోళనలు ఉధృతంగా మారాయి. నియామక పరీక్షను రద్దు చేయాలని, ఆ ఆరోపణలపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని, నియామక వ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ విద్యార్థి నాయకుడు దేవేంద్రనాథ్ మహతో ఆదివారం జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ ఆందోళనలకు కాక్రోచ్ జనతాపార్టీ మద్దతు ప్రకటించింది. జేపీఎస్సీ పరీక్ష ఫలితాలు గతనెల విడుదలయ్యాయి. తర్వాత ముఖ్యమంత్రిని కలిసి, పేపర్ లీక్‌పై ఆధారాలను సమర్పించాం. కొన్నివారాలుగా నిరసనలు జరుగుతున్నా.. విద్యార్థుల ఆందోళనలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం, జేపీఎస్సీ తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. దాంతో విద్యార్థులు నిరుత్సాహానికి గురవుతున్నారు. వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు, మా పోరాటాన్ని ఉధృతం చేసేందుకు నిరాహార దీక్ష ప్రారంభిస్తున్నాను. నిందితులకు శిక్ష పడటమే మా ప్రధాన లక్ష్యం అని స్టేడియంలోని ఆందోళనకారులను ఉద్దేశించి మహతో మాట్లాడారు. పేపర్ లీక్ ఆరోపణలు, నియామక పక్రియలో అవకతవకలు, పాలనాపరమైన లోపాలతో తమ కెరీర్‌కు తీవ్రనష్టం వాటిల్లుతోందంటూ ఆ రాష్ట్రంలోని విద్యార్థులు కొన్ని వారాల క్రితం నిరసనలు ప్రారంభించారు. జేపీఎస్సీ, జేఎస్ఎస్సీ సీజీఎల్ పరీక్షలకు సంబంధించి ఓఎంఆర్ షీట్ వైరల్ అయిన తర్వాతే ప్రభుత్వం స్పందించిందని ఆందోళనకారులు విమర్శించారు. ఈ పరీక్షల విషయంలో సంస్థాగత మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. వీరికి సీజేపీ మద్దతు ప్రకటించింది. నిరసనకారులతో మాట్లాడాం. వారికి మేం అండగా ఉంటాం.

# బిజెపిలోకి డీకే శివకుమార్?!

ఇప్పుడు అలానే చేస్తున్నారు కర్ణాటక సీఎం డీకే శివకుమార్. ఇటీవల మైసూరు లోని రామకృష్ణ విద్యాలయ ప్రాంగణంలో ప్రతిష్టాత్మక వివేకానంద స్మారక యూత్ సెంటర్ ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీతో వేదిక పంచుకున్నారు డిఎస్ శివకుమార్. సభాముఖంగా ప్రధాని నరేంద్ర మోడీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా వైరల్ అయ్యాయి. మా ప్రధాని మోదీ అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సంచలనం అవుతున్నాయి.

**మోడీకి ఆత్మీయ స్వాగతం..:** కర్ణాటక వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీకి సాదరంగా స్వాగతం పలికారు డీకే శివకుమార్. సభలో మా ప్రధాని మోదీ ఈ చారిత్రాత్మక వేడుకకు రావడం గర్వకారణంగా కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో మొత్తం కర్ణాటక మీతో నిలబడుతుంది.. కలిసి పని చేద్దాం అంటూ డీకే చేసిన కామెంట్స్ ఇప్పుడు సరికొత్త చర్చకు దారితీస్తున్నాయి. కర్ణాటక అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుంది. సహకార సమాఖ్య స్ఫూర్తితో కర్ణాటక కు విశాల హృదయంతో సహాయమందించి.. ఆదుకోవాలని ప్రధాని మోదీకి డీకే శివకుమార్ ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. ఇదే సభలో ప్రధాని నరేంద్ర మోడీ చేయి పట్టుకుని ఆప్యాయంగా నడుచుకుంటూ వెళ్లడం మీడియాలో హైలెట్ అయింది.

**కాంగ్రెస్ పార్టీలో కీలక నేత..:** డీకే శివకుమార్ కాంగ్రెస్ పాలిత రాష్ట్ర ముఖ్యమంత్రి. దక్షిణ భారతదేశంలో కాంగ్రెస్ పార్టీ కీలక నాయకుడు కూడా. కాంగ్రెస్ నాయకత్వం విషయంలో వీర విధేయతతో ఉంటారు. అటువంటి వ్యక్తి ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోడీని పొగడడం.. చనువుగా మెలగడం తీవ్ర చర్చకు దారితీసింది. అయితే కేంద్రంతో సఖ్యతగా ఉంటే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే భావనతోనే డీకే శివకుమార్ అలా వ్యవహరించి ఉంటారని కర్ణాటక కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగిస్తూనే రాష్ట్ర ప్రయోజనాలను నెరవేర్చడం కోసమే డీకే అలా చేసి ఉంటారన్న అభిప్రాయం కూడా వ్యక్తమౌతోంది. అయితే రేవంత్ మాదిరిగానే డీకే వ్యవహరించడం చర్చకు దారితీస్తోంది. తెలంగాణలో పర్యటించిన ప్రధాని మోదీ తో సన్నిహితంగా మెలిగారు రేవంత్ రెడ్డి. అభివృద్ధి కావాలి అంటే తనతో చేతులు కలపాలని మోదీ కోరారు. అప్పట్లో రేవంత్ బీజేపీకి దగ్గరవుతున్నట్లు కూడా ప్రచారం నడిచింది. ఇప్పుడు డీకే శివకుమార్ అలానే వ్యవహరిస్తుండడం పై కూడా అదే తరహా ప్రచారం జరుగుతుంది. అయితే ఇదంతా భవిష్యత్తు ఆలోచనతోనే కాంగ్రెస్ ముఖ్యమంత్రులు అలా చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది.

# జెన్ జీతో బిజెపి గ్రాఫ్ తగ్గిందా?!

రాజీనామాను సాధించుకోవడం.. ఈ జెన్ జీ ఉద్యమం సాధించిన తొలి పోరాటం అయితే.. బిజెపి మార్కు పాలిటిక్స్ కు తొలిబ్రేట్ పడినట్టే.

విపక్షాల ప్రయత్నం ఫలించలే.. అలాగని దేశంలో ఇతర రాజకీయ పక్షాలు బలపడలేదు ఈ ఉద్యమం ద్వారా. దీనిని ఒక రాజకీయ లబ్ధిగా మార్చుకోవాలన్న ప్రయత్నం కూడా ఫలించే ఛాన్స్ లేదు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వైఫల్యాలు, పేపర్ లీకేజీల రచ్చతో విసిగిపోయిన విద్యార్థులు ఈసారి సాంప్రదాయ రాజకీయ పార్టీల నేతల మాటలు నమ్మలేదు. ప్రతిపక్షాలు ఈ సమస్యను తమ రాజకీయాల అద్దెకి వాడుకోవాలని చూసిన ప్రతిసారి జెన్ జి లు దూరంగా ఉంచారు. ఇది మా భవిష్యత్తు పోరాటం.. ఇక్కడ రాజకీయరచ్చవద్దు అని తేల్చి చెప్పారు. కేవలం పారదర్శకత, జవాబు దారి తనం డిమాండ్ తో సాగిన ఈ నాన్ పొలిటికల్ ఉద్యమం ముందు కేంద్ర ప్రభుత్వం చిన్న పోయిందని చెప్పవచ్చు. రాజకీయ పార్టీల రంగులు పూసి ఆందోళనలను దిగజార్చి అవకాశం లేకపోవడం ఈ ఉద్యమం అతిపెద్ద బలం గా మారింది.

**లి ముందుగానే ముప్పు గ్రహించిన మోడీ..**


అయితే ఇప్పటివరకు రాజకీయ వ్యూహంలో ఆరితేరిపోయిన కేంద్ర ప్రభుత్వం, నరేంద్ర మోడీ ఈ ఉద్యమంతో ముప్పును ముందుగానే గుర్తించారు. ఒక రాజకీయ పార్టీ ధర్నా చేస్తే దానిని ఒక ఎన్నికల స్టంట్ అని చిత్రీకరించే ప్రయత్నం చేస్తుంది అధికార పార్టీ. కానీ స్వచ్ఛమైన మనసులతో తమ కష్టానికి ప్రతిఫలం కోరుతూ వీధిలోకి వచ్చిన లక్షలాది మంది అభ్యర్థుల ఆవేదనను ఏ ప్రభుత్వం కూడా నిర్లక్ష్యం చేయలేదు. రాబోయే రోజుల్లో దేశంలోనే అతిపెద్ద ఓటు బ్యాంకు గా మారబోతున్న ఈ జన్ జీ ఓటర్ల ఆగ్రహానికి గురైతే కలిగే నష్టాన్ని ముందుగానే అంచనా వేశారు నరేంద్ర మోడీ. అందుకే తన క్యాబినెట్లో ఉన్న విద్యాశాఖ మంత్రి తో రాజీనామా చేయించి.. నైతికతను గుర్తు చేయించారు. గతంలో రైతుల పోరాటాన్ని సకాలంలో గుర్తించి వ్యవసాయ బిల్లులను ఎలా వెనక్కి తీసుకున్నారో.. ఇప్పుడు జనతా కాక్రోచ్




ఉద్యమానికి సైతం అలానే భావించి తన క్యాబినెట్ సహచరుడు రాజీనామా చేయించారు. అయితే ఇప్పటివరకు ఇలాంటి వివాదాలతో పాటు ఉద్యమాలను హ్యాండిల్ చేసింది భారతీయ జనతా పార్టీ. అయితే తాజా ఉద్యమం మాత్రం బిజెపికి డ్యామేజ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం సైతం డ్యామేజ్ కంట్రోల్ చేసుకోగలిగింది.

మర్రిగూడ(క్రైమ్ మిర్రర్)

"గుమ్మడికాయల దొంగ ఎవరంటే భుజాలు తడుముకున్నట్లు" అనే సామెతను పోలినట్లు, మర్రిగూడ మండలంలో తాజాగా చోటుచేసుకున్న పరిణామాలు చర్చనీయాంశంగా మారాయి. కుదాబక్షుల్లి గ్రామంలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు, నకిలీ పంచాయతీ ధ్రువీకరణ పత్రాలు, ఫోర్జరీ సంతకాలు, నకిలీ స్టాంపులు ఉపయోగించిన వ్యవహారం, మర్రిగూడ పోలీస్ స్టేషన్ వరకు చేరుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ ఘటనపై వార్తలు వెలువడిన వెంటనే, ఆ వార్తలో తన పేరు కూడా ప్రత్యక్షంగా ప్రస్తావనలో లేకపోయినా, సదరు వ్యక్తి విలేకరిపై మర్రిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం, ఇప్పుడు అనేక అనుమానాలకు తావిస్తోంది.




## మర్రిగూడ పోలీస్ స్టేషన్‌లో విలేకరిపై ఫిర్యాదు..
## తన పేరు కూడా ప్రస్తావన లేనప్పుడు ఉలికిపాటు దేనికి..?
## గతంలో రెవెన్యూ రికార్డుల ఫోర్జరీ..
## ప్రభుత్వ అధికారి పిర్యాదుతో ఎఫ్ఐఆర్.!?

**తన పేరు లేని వార్తకు**
**ఇంత ఆవేశం ఎందుకు.. ఉలికిపాటు దేనికి..?**

నిజంగా సంబంధం లేకపోతే చట్టపరంగా విచారణ జరిగే వరకు వేచి చూడాల్సింది పోయి, ఫిర్యాదులతో హడావుడి చేయడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటన్న చర్చ మండలంలో సాగుతోంది. ఇదిలా ఉండగా, ఈ వ్యక్తిపై గతంలోనూ ఫోర్జరీ ఆరోపణలు వచ్చినట్లు స్థానికులు గుర్తు చేస్తున్నారు.!? కొన్నేళ్ల క్రితం రెవెన్యూ రికార్డుల్లో ఫోర్జరీ జరిగిన వ్యవహారంలో, కూడా ఎఫ్ఐఆర్ నమోదైందని గ్రామంలో చర్చ జరుగుతోంది.! ఆ ఘటనలో విచారణ ఏ దశకు చేరింది..? అప్పటి ఆరోపణలపై ఏం చర్యలు తీసుకున్నారు..? అనే ప్రశ్నలు మళ్లీ తెరపైకి వస్తున్నాయి. ప్రస్తుతం కుదాబక్షుల్లి వ్యవహారంలో కూడా పాత ఇంటి పన్ను రసీదులను ఆధారంగా చూపిస్తూ, ఖాళీ ప్రభుత్వ స్థలంపై హక్కు సాధించే ప్రయత్నం జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.! గ్రామ పంచాయతీ పేరుతో నకిలీ స్టాంపులు తయారు చేయించడం, అధికారుల సంతకాలను ఫోర్జరీ చేయడం వంటి అంశాలు బయటపడటంతో ఈ వ్యవహారం తీవ్రంగా మారింది. పంచాయతీ కార్యదర్శి స్వయంగా మర్రిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో, కేసు నమోదు దిశగా పోలీసులు చర్యలు చేపట్టినట్లు ఎఫ్ఐఆర్ చేసినట్లు తెలిసింది.స్థానికుల కథనం ప్రకారం, గతంలో రాజయ్య, హన్మయ్యలకు సంబంధించిన భూముల విషయంలోనూ, డబుల్ రిజిస్ట్రేషన్ ఆరోపణలు ఎదుర్కొన్న ఇదే వ్యక్తి ఇప్పుడు ప్రభుత్వ భూమిపై కూడా కన్నేశాడని విమర్శలు వినిపిస్తున్నాయి.!? రైతుల భూముల వ్యవహారాల నుంచి ప్రభుత్వ స్థలాల వరకు, వివాదాలు వెంటాడుతున్నప్పటికీ ఎలాంటి భయం లేకుండా అధికారుల సంతకాలనే, నకిలీగా తయారు చేయడం తీవ్ర నేరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇదే భూమి వివాదంపై విచారణకు వచ్చిన ఎంపీవోను అడ్డుకోవాలని, దాడి చేయాలని కొందరికి సూచించినట్లు చెబుతున్న వీడియోలు కూడా, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇక తాజా ఫోర్జరీ వ్యవహారంలో బయటపడిన నకిలీ పత్రాల్లోని చేతిరాత, గతంలో ఈ వ్యక్తి రాసిన దస్తూరి కాగితాల్లోని చేతిరాత, ఒకేలా ఉందనే అంశం ప్రస్తుతం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహిస్తే పూర్తి నిజాలు వెలుగులోకి వచ్చే, అవకాశముందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సోమవారం స్థానిక గ్రామ సర్పంచ్ పిర్యాదు మేరకు, నల్లగొండ జిల్లా ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ వివేక్, డిపిఓ తరుణ్ చక్రవర్తి, సందర్శించి ఫోర్జరీ అంశంపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్ కి, జిల్లా ఎస్పీ కి పిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పందుల జయలక్ష్మి ఎంపీడీఓ మునయ్య, ఎంపీవో రవి కుమార్,పంచాయతీ కార్యదర్శి, ఉప సర్పంచ్ గ్రామస్తులు పాల్గొన్నారు..

**ఈ మొత్తం వ్యవహారంపై పోలీసులు ఏ విధంగా విచారణ చేపడతారు..? గతంలో నమోదైన ఆరోపణలు, ప్రస్తుత ఫోర్జరీ కేసు మధ్య ఏమైనా సంబంధాలు ఉన్నాయా..? ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు నకిలీ పత్రాలు రూపొందించిన వారెవరు..? అనే పూర్తి వివరాలతో క్రైమ్ మిర్రర్ ప్రత్యేక కథనం త్వరలో...**

# కాంగ్రెస్‌లో 'నామినేటెడ్' చిచ్చు!

నామినేటెడ్ పదవుల భర్తీ కసరత్తు వేగవంతం అయినట్లు కూడా టాక్ నడిచింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ కార్పొరేషన్లు, ఫెడరేషన్లు, సొసైటీలు, కమిటీలకు సంబంధించి వందలాది పోస్టులు ఖాళీగా ఉండడంతో ఆశావహుల్లో సందడి మొదలైంది. అయితే రోజుల గడుస్తున్న కొలది వీటి భర్తీ జరగడం లేదు. దీంతో నేతల్లో ఒక రకమైన అసంతృప్తి పెరుగుతోంది.

**ఆ పదవులు సైతం ఖాళీ..**

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో 37 ప్రధాన కార్పోరేషన్లకు చైర్మన్ లను నియమించారు. అయితే ఇందులో కొందరికి పదవీకాలం రెండేళ్లుగా చూపించారు. అయితే అటువంటి చైర్మన్ పోస్టులకు సంబంధించి కొత్త వారిని నియమించలేదు. గతంలో పెండింగ్ గా చూపించిన




లను సైతం భర్తీ చేయలేదు. రాష్ట్రస్థాయిలో చాలా పదవులు ఖాళీ అయ్యాయి. జిల్లాస్థాయిలో ఖాళీ ఉన్నాయి. నియోజకవర్గస్థాయిలో భర్తీ చేయాల్సిన పదవులు కూడా ఉన్నాయి. కానీ ఎందుకో జాప్యం చేస్తోంది కాంగ్రెస్ హై కమాండ్.

**అసమ్మతి భయంతోనే..**

అయితే కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పోస్టుల భర్తీలో జాప్యానికి ప్రధాన కారణం అసమ్మతి భయం. ఆశావహులు వేల సంఖ్యలో ఉన్నారు. పోస్టులు చూస్తే వందల్లో ఉన్నాయి. పదవులు దక్కని సీనియర్లు, క్యాడర్ అసంతృప్తికి గురైతే పార్టీలో అంతర్గత విభేదాలు బయటపడే ప్రమాదం ఉంది. ఈ చిక్కుముడిని విప్పేందుకు రేవంత్ రెడ్డి కొత్త వ్యూహాలను పరిశీలిస్తున్నారు. పదవులు దక్కని నాయకులకు భవిష్యత్తులో జరగబోయే నియోజకవర్గాల పునర్విభజన తర్వాత అవకాశాలు కల్పిస్తామని చెబుతున్నారు. అయినా సరే నేతల్లో ఒక రకమైన అసంతృప్తి కనిపిస్తోంది.. అది ముదిరితే మాత్రం చాలా కష్టం.

# నిరుద్యోగులను మోసం చేసిన రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో కెటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 20వేల పోలీసు ఉద్యోగాల ఖాళీలు ఉంటే.. 7 వేల పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడమేంటన్నారు. ఉద్యోగాలు అడిగితే ఎండ్రిన్ తాగి చావాలని.. ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను క్రిమినల్ వేస్ట్ అని సీఎం అంటున్నారు. ముఖ్యమంత్రి బాధ్యత లేకుండా మాట్లాడు తున్నారని మండిపడ్డారు. సీఎం వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ స్పందించరా..? యూత్ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ 24 హామీలు ఇచ్చి ఒక్కటైనా నెరవేర్చిందా..? అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్న రేవంత్‌రెడ్డే క్రిమినల్ వేస్ట్ అంటూ విమర్శలు గుప్పించారుఉ. సీఎం రేవంత్ రెడ్డి ఏం చదివారో కూడా నాకు డౌటే. ఆయన ఎన్నికల నామినేషన్ పత్రం సొంతంగా నింపుకోగలరా?. ఆయన ఒక్క ఇంటర్వ్యూకైనా వెళ్లారా..?' అని కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో యువత తీవ్ర నిరాశలో ఉందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉద్యోగ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలోని యువత ఒక రకమైన నిర్వేదంలో ఉందన్నారు. దేశ రాజకీయాలను గమనిస్తున్న ప్రతి ఒక్కరికీ ఈ విషయం అర్థమవుతోందని.. ఎన్నికల సమయంలో యువతను వాడుకోవడం కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు అలవాటుగా మారిందన్నారు. అసెంబ్లీలో ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ ను ప్రస్తావిస్తూ.. రెండేళ్ల క్రితం కూడా ఉద్యోగాల భర్తీపై హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రచార సభల్లో ఇచ్చిన హామీలకు విలువ లేకపోయినా, కనీసం శాసనసభలో ఇచ్చిన మాటకైనా విలువ ఉండాలని అన్నారు. ఇటీవల ఖమ్మంలో వేణు అనే విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటనను ప్రస్తావించిన కేటీఆర్.. అతడు రాసిన సూసైడ్ నోట్‌లో రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు చేరే వరకు షేర్ చేయాలని పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. ఆ లేఖలో తమను కూడా ప్రస్తావించారని, అయితే అది సాధారణ సూసైడ్ నోట్ కాదని, కాంగ్రెస్ ప్రభుత్వంపై రాసిన చార్జ్‌షీట్‌లాంటిదని అన్నారు. అశోక్‌నగర్‌లో రాహుల్ గాంధీ ఇచ్చిన ఉద్యోగ హామీలను గుర్తు చేస్తూ.. ఉద్యోగాలు ఇవ్వకపోతే రాహుల్ గాంధీ ఇప్పుడు తెలంగాణకు ఎందుకు రావడం లేదు.? ఎక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందో అక్కడికి వెళ్లరు.. కానీ తమ ప్రభుత్వం లేని రాష్టాల్లో్ర మాత్రం రాజ్యాంగ పుస్తకం పట్టుకుని తిరుగుతారంటూ విమర్శించారు. చివరగా ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో మాజీమంత్రి జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి నిర్మూలనలో రాజీపడొద్దు

### యువత భవిష్యత్ కాపాడడంలో కృషి చేయాలి

### స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

అనకాపల్లి,ఆగస్ట్: రాష్ట్రంలో గంజాయి నిర్మూలనపై నిర్వహించిన 'సంకల్పం 2.0' కార్యక్రమంలో ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పాల్గొన్నారు. ఈ క్రమంలో ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి మూలాలను మట్టుబెట్టడంలో పోలీసులు ఏమాత్రం రాజీ పడకూడదని స్పష్టం చేశారు. విశాఖపట్నం పరిధిలోని ఇంజనీరింగ్ కాలేజీల హాస్టళ్లలో రాత్రి వేళల్లో విద్యార్థులు గంజాయి తాగుతున్నారనే విషయాలు తనిఖీల్లో వెల్లడవుతుండటం పట్ల ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలు గంజాయి బారిన పడితే వారి భవిష్యత్తు ఏమవుతుందో, వారి కుటుంబాల పరిస్థితి ఏంటో ఆలోచించాలని కోరారు. 'మనందరికీ పిల్లలు ఉన్నారు.. వారి భవిష్యత్తు రక్షణ కోసం పోలీసులు కఠినంగా వ్యవహరిస్తే ఎవ్వరూ ఏమీ చేయలేరు' అని పేర్కొన్నారు. గంజాయి సరఫరాదారుల సమాచారం కావాలంటే తానే స్వయంగా ఇస్తానని, దమ్ముంటే వారిని అరెస్టు చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న వారి పేర్లను తానిస్తానని.. వారిని అండమాన్ జైలుకు తరలించి కఠినంగా శిక్షించాలని పోలీసు అధికారులకు తెలిపారు. సమాజ శ్రేయస్సు కోసం గంజాయి నియంత్రణపై కఠిన చర్యలు తక్షణమే చేపట్టాలని పిలుపునిచ్చారు. అనకాపల్లి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నర్సీపట్నం స్టార్ హోమ్స్‌లో గంజాయి, డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సు నిర్వహించారు.

## నిజామాబాద్ ఆస్పత్రిలో ఎంఆర్ఐ మెషిన్ అవసరం

### మంత్రి దామోదరను కోరిన బాల్కొండ ఎమ్మెల్యే వేముల

హైదరాబాద్,ఆగస్ట్3: హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన నిర్వహించిన నిజామాబాద్ జిల్లా ఆరోగ్య శాఖ సమీక్ష సమావేశంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో నియోజకవర్గాల వారీగా ఆరోగ్య సంబంధిత సమస్యలు, ప్రభుత్వ వైద్య సంస్థల పనితీరు, మౌలిక సదుపాయాల కల్పన, మందుల లభ్యత, వైద్యులు మరియు సిబ్బంది అందుబాటు, ప్రజారోగ్య సేవల మెరుగుదల తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా బాల్కొండ నియోజకవర్గం ఆరోగ్య శాఖ కు సంబంధించి పలు ప్రతిపాదనలు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజానర్సింహకి అందించి మంజూరు చేయవలసిందిగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి విజ్ఞప్తి చేసారు. నిజామాబాద్ జిల్లా ?ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో ఎంఆర్ఐ మెషిన్ ను మంజూరు చేయాలనీ, ఖాళీ పోస్టు లను భర్తీ చేయాలనీ,అత్యవసర అవసరాల కోసం నిధులు మంజూరు చేయాలని విన్నవించారు.

GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595




తెలంగాణలో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తోంది. ప్రధాన సమస్యలపై ఇప్పటికీ స్పష్టత లేకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. ముఖ్యంగా ధరణి విషయంలో ఎన్నో చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పటికీ దీనిపై స్పష్టత లేదు. ఎన్ని భూములు అన్యాకాంత్రం అయ్యాయో తెలియదు. దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్య తీసుకోలేదు. దేవాదాయ భూములు తెలంగాణలో వేల ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయి. కొందరు దౌర్జన్యంగా అవి పట్టాలు చేయించుకుని, రైతుభరోసా కూడా పొందుతున్నారు. ఈ భూములను స్వాధీనం చేసుకోవడంలో గత కెసిఆర్ ప్రభుత్వం, రేవంత్ ప్రభుత్వం కూడా విఫలమయ్యింది. మంత్రి కొండా సురేఖ ఉత్సవ విగ్రహంలా తయారయ్యారన్న విమర్శలు ఉన్నాయి. ఎపిలో కూడా ఇలాంటి భూములపై చంద్రబాబు ఒక్కమాటా మాట్లాడడం లేదు. ఇకపోతే కాళేశ్వరంపై విమర్శలు తప్ప ఉన్న ప్రాజెక్టును ఉపయోగించుకునే ఆలోచన చేయడంలేదు. జర్నలిస్టుల అక్రిడిటేషన్లపై గందరగోళం జరుగు తోంది. దీనిని సజావుగా పరిష్కరించడం లేదు. కోర్టుల్లో కేసులు కూడా దాఖలు అయ్యాయి. జర్నలిస్టులు ఇంటిస్థలాలు, ఆరోగ్య కార్డులు ఊసే లేదు. ఇప్పటికే ఉమ్మడి ఎపిలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి కేటాయించిన 70 ఎకరాల భూమిని కాజేసే కుట్రలు మొదలయ్యాయి. సుప్రీంకోర్టు తీర్పును బూచిగా చూపి, వేలకోట్ల విలువ చేసే భూమిని లాగేసుకుని, జర్నలిస్టులకు మొండిచేయి చూపేందుకు రంగం సిద్దం చేశారు. ఇందులో కొందరు జర్నలిస్టుల పాత్రకూడా ఉంది. జర్నలిస్టులకు అన్యాయం చేయడంలో టిడిపి ప్రభుత్వం, జగన్ ప్రభుత్వం కూడా ఎపిలో ఇదే తరహా పోకడలు సాగించింది. ఇక అన్నింటికన్నా పెద్ద సమస్య నిరుద్యోగ సమస్య. మొన్నటికి మొన్న ఢిల్లీలో కాక్రోచ్ జనతాపార్టీ ఆందోళనలకు మద్దతు తెలిపిన రాహుల్, రేవంత్ రెడ్డిలు తెలంగాణ నిరుద్యోగుల ఆందోళనలకు మాత్రం సమాధానం చెప్పడం లేదు. ఇక్కడా అలాంటి ఉద్యమం వస్తే తప్ప వీరు స్పందించేలా లేరు. క్యాలెండర్లు మారాయి కానీ కొలువులు మాత్రం రావడలేదని ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

## హామీలను మోసగిస్తున్న పాలకులు !

తెలంగాణలో ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలిస్తానన్న కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు దాటినా నిరుద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదు. ఇటీవలే సిఎం రేవంత్ 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు. అంటే ఆయన ఇచ్చిన హామీని ఆయనే నెరవేర్చలేదని చెబుతున్నారు. అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌కు రెండేండ్లు పూర్తయినా.. నోటిఫికేషన్లు విడుదల చేయలేదు. నోటిఫికేషన్లపై మాట తప్పిన సర్కార్ మీద నిరుద్యోగులు ఆగ్రహంగా ఉన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్.. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ.. నాలుగువేల రూపాయల చొప్పున నిరుద్యోగ భృతి.. ఇదీ కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ. కానీ, అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను విస్మరించింది. జాబ్ క్యాలెండర్ జాడ లేదు. నిరుద్యోగ భృతి ఊసులేదు. 'ఇదిగో మా నిబద్ధత..' అంటూ 2024 ఆగస్టు 2న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్‌ను ప్రవేశపెట్టారు. 15 రకాల నోటిఫికేషన్లు ఇస్తామని చెప్పారు. ఈ క్యాలెండర్ గడువు కూడా ముగిసింది. కానీ, అందులో పేర్కొన్న ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల కాలేదు. 2025 ఆగస్టు 2,శనివారంతో 2026 ఆగస్టు 2 కూడా గడిచిపోయింది.రెండేండ్ల గడువు పూర్తయ్యింది. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌కు విలువ లేకుండా పోయింది. నిరుద్యోగ యువతను తమవైపు తిప్పుకొనేం దుకు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు యూత్ డిక్లరేషన్ ప్రకటించింది. దీనిని ఎన్నికల మ్యానిఫెస్టోలో సైతం పొందుపరిచింది. కానీ, డిక్లరేషన్‌లో ప్రకటించిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. ఉద్యోగాలొచ్చే వరకు యువతకు నెలకు రూ. 4వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని కూడా కాంగ్రెస్ నేతలు మరచిపోయారు. అమ్మాయిలకు ఎలక్ట్రిక్ స్కూటీలు ఇస్తామన్న హామీని కూడా నెరవేర్చలేదు. రూ.5 లక్షల విద్యాభరోసా కార్డు, రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామన్న హామీని పట్టించుకోలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఏటా దాదాపు 9వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్ అవుతున్నట్లు అంచనాలు ఉన్నాయి. వీరితోపాటు విద్యుత్తు సంస్థలు, పలు బోర్డులు, విభాగాల్లోనూ పెద్దఎత్తున ఉద్యోగ విరమణ పొందుతున్నారు. తాజా గణాంకాల ప్రకారం పాఠశాల విద్యాశాఖలో 14వేలకుపైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అంటున్నారు. యూనివర్సిటీల్లో 2వేలకుపైగా బోధన, మరో 2,800 బోధనేతర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గురుకులాల్లో ఆరువేలు, ఆర్టీసీలో మూడువేలకుపైగా, పోలీసుశాఖలో 17వేలకుపైగా ఖాళీలున్నాయి. ఎక్సైజ్ శాఖలో వెయ్యి, అంగన్‌వాడీల్లో 15వేలకుపైగా, మైనారిటీ సంక్షేమ శాఖలో మూడువేలకుపైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇలా పలు శాఖల్లో పెద్దఎత్తున ఖాళీలున్నా సర్కార్ నోటిఫికేషన్లు విడుదల చేయడంలేదన్న ఆందోళన నిరుద్యోగుల్లో ఉంది. మరోవైపు రాష్ట్రంలో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉండటం గమనార్హం. మూడు లక్షల మంది రెగ్యులర్ ఉద్యోగులుంటే అంతే స్థాయిలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. దీనికి గత కెసిఆర్ ప్రభుత్వం ప్రధాన దోషిగా ప్రకటించాలి.

**ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారం ప్రజల నుంచి వస్తుంది. ఆ అధికారాన్ని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాలు, అధికారులు రాజ్యాంగం నిర్దేశించిన పరిధిలో వినియోగించాల్సి ఉంటుంది. ఈ సూత్రాన్నే "రూల్ ఆఫ్ లా" అంటారు. చట్టం అందరికీ సమానంగా వర్తించాలి. అధికారం ఎంత ఉన్నతమైనదైనా, పదవి ఎంత గొప్పదైనా, చట్టం ముందు అందరూ సమానమే. ఇదే భారత రాజ్యాంగం చెప్పే ప్రధాన సందేశం. ఇటీవలి పరిణామాలు మరోసారి ఒక కీలక ప్రశ్నను మన ముందుంచాయి.**




# చట్టమే సర్వోన్నతం.. అదే ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు.....

ప్రభుత్వ యంత్రాంగం కోర్టు ఆదేశాలను ఎంతవరకు గౌరవిస్తోంది? న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులు అమలు కాకపోతే ప్రజాస్వామ్య వ్యవస్థపై ఎలాంటి ప్రభావం పడుతుంది? ఈ ప్రశ్నలకు సమాధానం వెతికే అవసరం గతంలో ఎన్నడూ లేనంతగా ఇప్పుడు కనిపిస్తోంది. న్యాయస్థానం ఒక కేసులో ఇచ్చే తీర్పు కేవలం ఇద్దరు వ్యక్తుల మధ్య ఉన్న వివాదానికి పరిష్కారం మాత్రమే కాదు. అది రాజ్యాంగం, చట్టం, న్యాయసూత్రాల ఆధారంగా ఇచ్చే నిర్ణయం. అందుకే కోర్టు ఉత్తర్వులను అమలు చేయడం ప్రతి ప్రభుత్వ సంస్థకు, ప్రతి అధికారికి రాజ్యాంగబద్ధమైన బాధ్యత. వాటిని తమకు అనుకూలంగా అర్థం చేసుకోవడం, పట్టించుకోకపోవడం లేదా ఉద్దేశపూర్వకంగా విస్మరించడం న్యాయవ్యవస్థకే కాదు, ప్రజాస్వామ్య వ్యవస్థకూ సవాలుగా మారుతుంది.

పభుత్వ అధికారులకు చట్టం అనేక అధికారాలు ఇచ్చింది. కానీ ఆ అధికారాలకు కూడా పరిమితులు ఉన్నాయి. ప్రజల ఆస్తులు, హక్కులు, స్వేచ్ఛల విషయంలో చట్టం చెప్పిన విధానాన్ని తప్పనిసరిగా అనుసరించాలి. నోటీసులు ఇవ్వడం, విచారణకు అవకాశం కల్పించడం, కోర్టు ఆదేశాలను గౌరవించడం వంటి అంశాలు పరిపాలనలో కేవలం విధివిధానాలు మాత్రమే కావు; అవి రాజ్యాంగ పరిరక్షణకు సంబంధించిన విలువలు.

ప్రజాస్వామ్యంలో "రూల్ ఆఫ్ లా"కు బదులుగా "రూల్ ఆఫ్ మెన్" చోటు చేసుకుంటే దాని పరిణామాలు తీవ్రమవుతాయి. చట్టం స్థానంలో వ్యక్తుల అభిప్రాయాలు, అధికార దర్పం, ఇష్టానుసార నిర్ణయాలు ఆధిపత్యం చెలాయిస్తే సంస్థలపై ప్రజల విశ్వాసం క్రమంగా దెబ్బతింటుంది. అలాంటి పరిస్థితి ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతం. రాజ్యాంగం వ్యక్తులను కాదు, వ్యవస్థలను బలపరుస్తుంది. వ్యక్తులు వస్తారు, వెళ్తారు; కానీ సంస్థలు శాశ్వతం.

న్యాయవ్యవస్థకు ఉన్న అత్యంత పెద్ద బలం ప్రజల విశ్వాసం. ఆ విశ్వాసాన్ని కాపాడటానికి కోర్టులు తమ ఉత్తర్వుల అమలుపై కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుంది. కోర్టు ధిక్కరణ చట్టం కూడా ఇదే ఉద్దేశంతో రూపొందించబడింది. దీని లక్ష్యం వ్యక్తులను శిక్షించడం కాదు; న్యాయవ్యవస్థ గౌరవాన్ని, చట్టపాలనను పరిరక్షించడం. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినప్పుడు చర్యలు తీసుకోకపోతే, భవిష్యత్తులో న్యాయవ్యవస్థ ప్రభావం తగ్గిపోయే ప్రమాదం ఉంటుంది. క్షమాపణ అనే పదానికి కూడా ఒక నైతిక విలువ ఉంది. నిజమైన పశ్చాత్తాపంతో చేసిన క్షమాపణకు సమాజం ఎప్పుడూ విలువ ఇస్తుంది. కానీ బాధ్యత నుంచి తప్పించుకోవడానికి, శిక్ష నుంచి బయటపడటానికి చివరి క్షణంలో చెప్పే క్షమాపణ న్యాయసూత్రాలకు అనుగుణంగా ఉండదు. ప్రజాస్వామ్యంలో బాధ్యత అనేది మాటల్లో కాదు, చేతల్లో కనిపించాలి.

ఈ సందర్భంలో మరో అంశం కూడా గుర్తుంచుకోవాలి. ప్రభుత్వాధికారులు ప్రజల సేవకులు. వారు ప్రజలపై పాలకులు కాదు. వారి ప్రతి నిర్ణయం ప్రజా ప్రయోజనం, చట్టబద్ధత, పారదర్శకత అనే మూడు సూత్రాలపై ఆధారపడాలి. అధికారాన్ని వినయంతో వినియోగించినప్పుడే పరిపాలనకు గౌరవం పెరుగుతుంది. అధికార దర్పం చివరికి సంస్థల ప్రతిష్ఠను దెబ్బతీస్తుంది. నేటి భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా గుర్తింపు పొందింది. ఈ గౌరవాన్ని నిలబెట్టుకోవాలంటే రాజ్యాంగ వ్యవస్థల మధ్య సమతుల్యత తప్పనిసరి. శాసనసభలు చట్టాలు చేయాలి, కార్యనిర్వాహక వ్యవస్థ వాటిని అమలు చేయాలి, న్యాయవ్యవస్థ వాటి రాజ్యాంగబద్ధతను పర్యవేక్షించాలి. ఈ మూడు వ్యవస్థల్లో ఏదైనా ఒకటి తన పరిమితులు దాటితే ప్రజాస్వామ్య సమతుల్యత దెబ్బతింటుంది.

చరిత్ర చెబుతున్న గొప్ప పాఠం ఒక్కటే---అధికారం శాశ్వతం కాదు, పదవులు శాశ్వతం కాదు, వ్యక్తులు కూడా శాశ్వతం కాదు. కానీ రాజ్యాంగం, చట్టం, న్యాయవ్యవస్థలు శాశ్వత విలువలు. వాటి గౌరవాన్ని కాపాడిన దేశాలే అభివృద్ధి చెందాయి. వాటిని నిర్లక్ష్యం చేసిన వ్యవస్థలు కాలగర్భంలో కలిసిపోయాయి.

అందుకే ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే ప్రతి అధికారి, ప్రతి ప్రజాప్రతినిధి, ప్రతి పౌరుడు ఒక విషయాన్ని ఎప్పటికీ మరవకూడదు---చట్టం కంటే ఎవరూ గొప్పవారు కాదు. "రూల్ ఆఫ్ లా" బలపడితేనే ప్రజాస్వామ్యం బలపడుతుంది. చట్టం గెలిస్తేనే ప్రజల విశ్వాసం గెలుస్తుంది; ప్రజల విశ్వాసం గెలిస్తేనే దేశం నిజమైన అర్థంలో ప్రజాస్వామ్యంగా నిలుస్తుంది.




-డాక్టర్ సయ్యద్
ఇక్రాముల్లా హుసైనీ
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
సెల్: 9849073143


# సమన్వయంతో అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు

**సమర్ధంగా 1అమలుకు కలసి పనిచేయాల్సిందే**

**అధికారులతో సమీక్షలో సిఎస్ స్పష్టీకరణ**

హైదరాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసే పలు అభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు మరింత పటిష్టంగా అమలయ్యేందుకు వివిధ శాఖల మధ్య సమన్వయము అవసరమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖల ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, వికాస్ రాజ్, మహేష్ దత్ ఎక్కా, సవ్య సాచి ఘోష్, వాణి ప్రసాద్, దాన కిషోర్, నవీన్ మిట్టల్,ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, అహ్మద్ నదీమ్, క్రిస్టినా చొంగ్తూ, రఘునందన్ రావ్, కార్యదర్శులు గౌరవ్ ఉప్పల్, హరిచందన, బాల మాయాదేవి, సురేంద్ర మోహన్, ఇలంబర్తి తదితరులు హాజరయ్యారు. సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి గారి దార్శనికతతో రాష్ట్రంలో పురోగతిలో ఉన్నఅనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలయ్యేందుకు వివిధ శాఖల మధ్య అంతర్గత సమన్వయము అవసరమని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల పురోగతి, లక్ష్యాలు, అమలు తదితర వివరాలను సవివరంగా తెలిపే డాష్ బోర్డు ను ఏర్పాటు చేస్తున్నామని, అదేవిధంగా ఈ పథకాలు, కార్యక్రమాలు లక్ష్యాల మేరకు అమలవడానికి స్పీడ్ సెల్ కూడా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. మరో వారం రోజుల్లో ప్రభుత్వ ఎ÷-లాగ్ షిప్ పథకాలు, కార్యక్రమాలు, ప్రభుత్వ శాఖల పనితీరు, లక్ష్యాలు, పురోగతి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, కేంద్రప్రాయోజిత పథకాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రభుత్వ కార్యదర్శులతో త్వరలో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారని, ఇందుకు సన్నద్ధం కావాలని



కార్యదర్శులకు సూచించారు. ప్రతీ శాఖలో అమలవుతున్న వినూత్న పథకాలు/ విజయ గాధాలపై నివేదిక రూపొందించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలతో సహా అన్నింటికీ టి-్ ÷బైర్ కనెక్టివిటీ ని తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన విజన్ డాక్యుమెంట్-2047 లో సూచించిన నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికా బద్దంగా పని చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాల్సిన యుటిలైజేషన్ సర్టిఫికెట్లు, నివేదికలు, ప్రతిపాదనలను సకాలంలో కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలని, తద్వారా కేంద్ర నిధులు విడుదల కావడానికి మార్గం సుగమం అవుతుందన్నారు. నవంబర్ 14వ తేదీ నుండి రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే ఖేలో-ఇండియా క్రీడోత్సవాలను విజయ వంతంగా నిర్వహించేందుకు వివిధ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. దాదాపు 7 వేలకు పైగా క్రీడా కారులు, అధికారులు, కోచ్ లు హాజరయ్యే ఈ ఖేలో ఇండియా స్పోర్ట్స్ కు 26 క్రీడా రంగాల్లో పోటీలను 11 వేదికలలో నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. కొర్ పరిధిలో వాహన కాలుష్యాన్ని తగ్గించాలన్న ముఖ్యమంత్రిగారి ఆదేశాలమేరకు డీజిల్ తో నడిచే ఆటోలకు ఎలక్ట్రిక్ ఇంజన్లు అమర్చే పథకాన్ని వేగవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో ఎల్-నినో ప్రభావంతో వరి పంటకు సరిపడా నీరు లభ్యం కాదని, ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల పట్ల రైతులకు అవగాహన కల్పించాలని సిఎస్ సూచించారు.

# పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై అసంతృప్తి

**ఇందిరాపార్క్ వద్ద నిరుద్యోగుల మెరుపు ధర్నా**

**19వేల ఖాళీ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్**

హైదరాబాద్,: తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల భర్తీ పక్రియపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ నిరుద్యోగ యువత హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ చౌరస్తాలో సోమవారం మెరుపు ధర్నాకు దిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 7,437 పోలీస్ పోస్టుల నోటిఫికేషన్ సరిపోదని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న సుమారు 19 వేల పోలీస్ పోస్టుల భర్తీకి మరో సమగ్ర నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నోటిఫికేషన్ విడుదలలో జరిగిన జాప్యం కారణంగా వేలాది మంది అభ్యర్థులు వయోపరిమితి దాటిపోయారని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఉద్యోగాలకు అర్హత కోల్పోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలంటే వయోపరిమితిని పెంచాల్సిందేనని ప్రభుత్వాన్ని కోరారు. పోలీస్ నియామక నోటిఫికేషన్‌లో కానిస్టేబుల్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితిని 36 సంవత్సరాలకు, సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) పోస్టులకు 38 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే దరఖాస్తు రుసుము కూడా నిరుద్యోగులపై అదనపు భారం అవుతోందని, దానిని వెంటనే తగ్గించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన నిరుద్యోగులు, తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పోలీస్ ఉద్యోగాల భర్తీలో పారదర్శకతతో పాటు నిరుద్యోగులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నేతలు మధుసూదన్ గౌడ్, శ్రీకాంత్, వీరేష్, కరుణాకర్, శ్రీకాంత్ రాథోడ్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

# యూరియా కోసం రైతుల అవస్థలు.. వెంటనే సమస్య పరిష్కరించాలి: బీఎస్పీ

## బహుజన్ సమాజ్ పార్టీ మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జి ఐతరాజు అభయేందర్



**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, ఆగస్టు 03 (క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లాలో యూరియా ఎరువుల కొరత, యాప్ ఆధారిత పంపిణీ విధానం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జి ఐతరాజు అభయేందర్ అన్నారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం చౌటుప్పల్ ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి, పత్తి, మొక్కజొన్నతో పాటు ఇతర పంటలకు ప్రస్తుతం యూరియా అత్యవసరంగా అవసరమైన సమయంలో రైతులు ఎరువుల కోసం దుకాణాల చుట్టూ తిరుగుతున్నా, సరిపడా నిల్వలు లేక నిరాశతో వెనుదిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాప్ ద్వారా మాత్రమే యూరియా బుకింగ్ తప్పనిసరి చేయడంతో సాంకేతిక పరిజ్ఞానం లేని రైతులు, వృద్ధులు, నిరక్షరాస్యులు, చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో యూరియా నిల్వలను అందుబాటులో ఉంచాల్సి ఉండగా, క్షేత్రస్థాయిలో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో రైతులు రోజుల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కొన్ని ప్రాంతాల్లో బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలపై వస్తున్న ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**అలాగే ప్రభుత్వం వెంటనే ఈ క్రింది చర్యలు చేపట్టాలని కోరారు:** ప్రతి ఎరువుల దుకాణంలో తగినంత యూరియా నిల్వలు అందుబాటులో ఉంచాలి. యాప్‌తో పాటు ఆఫ్‌లైన్ విధానంలో కూడా యూరియా పంపిణీ చేయాలి. బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలపై ప్రత్యేక విజిలెన్స్ బృందాలతో తనిఖీలు నిర్వహించాలి. రైతులు గంటల తరబడి క్యూలలో నిలబడకుండా టోకెన్ లేదా గ్రామాల వారీగా పంపిణీ వ్యవస్థ అమలు చేయాలి. జిల్లాలోని ప్రతి మండలానికి అవసరమైన మేరకు అదనపు యూరియా నిల్వలను వెంటనే కేటాయించాలి. వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సమన్వయంతో ప్రత్యేక నియంత్రణ కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి. ఎరువుల నిల్వలు, పంపిణీ వివరాలను ప్రతిరోజూ ప్రజలకు పారదర్శకంగా వెల్లడించాలి. రైతుల పంటలను కాపాడాలంటే యూరియా కొరతను వెంటనే నివారించి, ప్రతి అర్హ రైతుకు సకాలంలో ఎరువులు అందేలా ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా కార్యదర్శి కత్తుల పరమేష్, నియోజకవర్గ ఇన్‌చార్జి బొట్ట శివ, నియోజకవర్గ అధ్యక్షుడు తగరం శుభాష్ చంద్రబోస్, నియోజకవర్గ కోశాధికారి మాధ రమేష్, నారాయణపురం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల గిరి, సీనియర్ నాయకులు ఎర్రోళ్ల వెంకటయ్య, కత్తుల నర్సింహ, కురిమిద్ద యాదయ్య, ఖైతాపురం శివ, రైతులు మల్లయ్య, శివయ్య, అబ్బయ్య, ఈశ్వరయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# స్థానికుల సమస్యకు పరిష్కారం

### వర్షపు నీటి నిల్వ తొలగింపు



గండిపేట(క్రైమ్ మిర్రర్): మణికొండ మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో, స్థానిక నాయకుడు మాల్యాద్రి నాయుడు ఆధ్వర్యంలో గోల్డెన్ టెంపుల్ సమీపంలోని బాబా నివాస్ అపార్ట్‌మెంట్ ఎదురుగా ఉన్న సందులో రోడ్డుపై నిలిచిపోయిన వర్షపు నీటిని డ్రైనేజీ వ్యవస్థలోకి మళ్లించే పనులు విజయవంతంగా చేపట్టారు. కొద్ది రోజులుగా వర్షాల కారణంగా రోడ్డుపై నీరు నిల్వ ఉండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై స్పందించిన మాల్యాద్రి నాయుడు సంబంధిత మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టించారు. దీంతో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు పూర్తిగా తొలగిపోయి ప్రజలకు ఉపశమనం లభించింది. ఈ సందర్భంగా స్థానికులు స్పందిస్తూ ప్రజా సమస్యను వెంటనే పరిష్కరించిన మాల్యాద్రి నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రజా సమస్యల పరిష్కారంలో ఇదే చొరవతో ముందుండాలని కోరారు.


క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.
క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.
తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.
న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.
స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.
సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.
సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.
ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.
9393929595


### ఆషాఢ మాసం వేళ ఆస్బెస్టాస్ కాలనీలో

# గోరింటాకు పండుగ వైభవం

### శ్రీ రేణుక ఎల్లమ్మ -- నల్ల పోచమ్మ ఆలయంలో మహిళల సందడి

### తెలంగాణ సంప్రదాయాలకు ప్రతీకగా వేడుకలు



**కూకట్‌పల్లి, ఆగస్ట్ 03 (క్రైమ్ మిర్రర్):** శేరిలింగంపల్లి నియోజకవర్గం, వెంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలోని ఆస్బెస్టాస్ కాలనీలోని శ్రీ రేణుక ఎల్లమ్మ -- నల్ల పోచమ్మ ఆలయం ఆషాఢ మాసం సందర్భంగా భక్తిశ్రద్ధలతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల సౌరభాన్ని వెదజల్లింది. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన గోరింటాకు పండుగలో కాలనీలోని మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎంతో ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు. తెలంగాణ ఆచార వ్యవహారాల్లో విశిష్ట స్థానాన్ని కలిగిన గోరింటాకు పండుగను మహిళలు ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఒకరికి ఒకరు గోరింటాకు పెట్టుకుంటూ, సంప్రదాయ పాటలు ఆలపిస్తూ, మంగళహారతులు ఇస్తూ పండుగకు ప్రత్యేక శోభ తీసుకొచ్చారు. రంగురంగుల చీరలు, సంప్రదాయ ఆభరణాలతో అలంకరించుకుని విచ్చేసిన మహిళలు ఆలయ ప్రాంగణాన్ని కళకళలాడేలా చేశారు. ఈ సందర్భంగా ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యం కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం మహిళలు కలిసి గోరింటాకు కార్యక్రమాన్ని నిర్వహించి పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పెద్దలు మాట్లాడుతూ, గోరింటాకు పండుగ అనేది కేవలం ఒక సంప్రదాయం మాత్రమే కాదని, మహిళల మధ్య అనుబంధాన్ని పెంపొందించే సామాజిక వేడుక అని పేర్కొన్నారు. ఇలాంటి పండుగలు కొత్త తరానికి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని తెలియజేస్తాయని అన్నారు. వేడుకల్లో పాల్గొన్న మహిళలు ఆషాఢ మాసంలో అమ్మవారి ఆశీస్సులతో గోరింటాకు పెట్టుకోవడం శుభప్రదమని, ప్రతి ఏడాది ఇదే ఉత్సాహంతో ఈ పండుగను నిర్వహిస్తామని తెలిపారు.

చివరగా ఆలయ కమిటీ సభ్యులు వేడుకల విజయవంతానికి సహకరించిన మహిళలకు, భక్తులకు కృతజ్ఞతలు తెలియజేశారు. భక్తి, ఆనందం, సంప్రదాయాల సమ్మేళనంగా నిర్వహించిన ఈ గోరింటాకు పండుగ ఆస్బెస్టాస్ కాలనీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, తెలంగాణ సంస్కృతి వైభవాన్ని మరోసారి ప్రతిబింబించింది.



# నిజాయితిని చాటుకున్న ఆటో డ్రైవర్ సత్యం

**పెద్దపల్లి జిల్లా క్రైమ్ మిర్రర్ ఆగస్టు 03 న్యూస్:** నాడు గోదావరిఖనికి చెందిన పద్మ అనువారు పెద్దపల్లి కంచి షాపింగ్ మాల్ నందు పెళ్లి సామాను తీసుకొని సాయంత్రం అందాదా 4 గంటలకు రన్నింగ్ ఆటోలో ఎక్కి వారి సామాను వున్న బ్యాగ్ ను ఆటోలో మరిచి బస్ స్టాండ్ వద్ద దిగి వెళ్ళిపోగా, అకొద్దిసేపటికి ఆటో డ్రైవర్ బ్యాగ్ ను గుర్తించి పెద్దపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ కి వచ్చి ఇట్టి సమాచారం ఇవ్వగా అట్టి ప్రయాణికులను గుర్తించి వారి బ్యాగ్ వారికి తిరిగి ఇవ్వడం జరిగినది సుమారు 20,000/- రూపాయల విలువగల వస్తువులు గల బ్యాగ్ ను ప్రయాణికులకు చేరేలా చేసి నిజాయితీని చాటుకున్న తుర్కల మద్దికుంట కు చెందిన ఆటో డ్రైవర్ సత్యంను ౘ× నరేష్ అభినందించడం జరిగింది.

# అంగన్వాడి భవనం, వికలాంగుల భవనల పనులను ప్రారంభించిన సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి, పాలకవర్గం



**సంస్థాన్ నారాయణపురం, ఆగస్టు 03(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో అంగన్వాడి భవనశీ, వికలాంగుల భవనల కోసం మండల కేంద్రంలోని నల్లగొండ సహకార బ్యాంకు పెద్ద దర్వాజా ప్రక్కన గ్రామ కంట భూమిని సేకరించి, పనులు ప్రారంభించిన సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి,పాలకవర్గం. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు గుత్త ప్రేమ్చందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ, పంచాయతీ కార్యదర్శి నవీన్ కుమార్, వార్డ్ సభ్యులు సూరపల్లి వెంకటేష్, పందుల యాదగిరి గౌడ్, బల్గురి శివ, చింతల శైలజ సత్యనారాయణ, మహమ్మద్ అలీమా యూసఫ్ ఖాన్,నీళ్ల అనిత శంకర్, బిజెపి నాయకులు సూరపల్లి శివాజీ, బద్దం యాదయ్య,ఏపీఎం శ్రీదేవి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బద్దుల మురళి యాదవ్, యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగరాజు, గ్రామ శాఖ సహాయ కార్యదర్శి రేవన పెల్లి గోపాల్, మాజీ వార్డ్ మెంబర్ మహ్మద్ అడ్డు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గనిగంటి రాజు గౌడ్, రాస మల్ల వెంకటయ్య, బద్దుల యాదగిరి యాదవ్,ఎండి హబ్బు, వడ్డేపల్లి శివప్రసాద్, పులగొని బిక్షపతి, ఎండీ వజిత్.వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# నేపాల్ ప్రతినిధులకు ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో పట్టణ పాలనపై శిక్షణ ప్రారంభం



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థ (ఎన్ఐఆర్‌డీపీఆర్)లో నేపాల్‌కు చెందిన పట్టణ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల కోసం అర్బన్ గవర్నెన్స్ పై 10 రోజుల ప్రత్యేక శిక్షణా కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమం ఆగస్టు 3 నుంచి 12 వరకు కొనసాగనుంది. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణలో నేపాల్‌లోని కోషి ప్రావిన్స్‌కు చెందిన ఇలామ్, పాంచ్థర్, తాప్లేజుంగ్, తెహ్రాథుమ్ జిల్లాల మేయర్లు, చైర్‌పర్సన్లు, సభ్యులు పాల్గొంటున్నారు. ప్రారంభ కార్యక్రమంలో విదేశాంగ మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రటరీ సకేత రాజా ముసినిపల్లి మాట్లాడుతూ భారత్--నేపాల్ స్నేహ సంబంధాల బలోపేతానికి సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాలు కీలకమని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా ఇరు దేశాలు పరస్పర అనుభవాలను పంచుకుని మెరుగైన పట్టణ పాలనకు తోడ్పడతాయని పేర్కొన్నారు. ఎన్ఐఆర్‌డీపీఆర్ అధికారులు పట్టణ పాలన, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, వ్యవసాయం, ఉద్యానవనం, మురుగునీటి నిర్వహణ, ఘన వ్యర్థాల నిర్వహణ, ఎకో టూరిజం, సాంకేతికత తదితర అంశాలపై శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. అలాగే హైదరాబాద్‌తో పాటు మహారాష్ట్ర, తమిళనాడులోని ఉత్తమ పట్టణ పాలన నమూనాలను ప్రతినిధులు సందర్శించేలా ప్రత్యేక అధ్యయన పర్యటనలు కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

# ఈనెల 6న సీపీఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ రాసాల వెంకటేష్ స్థూపావిష్కరణ

## బహిరంగ సభకు రానున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ




**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, ఆగష్టు 03(క్రైమ్ మిర్రర్):** సీపీఎం సీనియర్ నాయకులు, రైతు సంఘం మాజీ డివిజన్ కార్యదర్శి, బస్వాపురం గ్రామ మాజీ సర్పంచ్ కామ్రేడ్ రాసాల వెంకటేష్ వర్ధంతి పురస్కరించుకుని ఈనెల 6వ తేదీన బస్వాపురం గ్రామంలో నిర్మించిన స్థూప అవిష్కరణకు బహిరంగ సభకు ముఖ్యఅతిథులుగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ హాజరవుతున్నారని రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మ తెలిపారు. సోమవారం భువనగిరి సుందరయ్య భవన్లో సీపీఎం భువనగిరి మండల కమిటీ సమావేశం జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహ పాల్గొని మాట్లాడు కామ్రేడ్ రాసాల వెంకటేష్ ఎర్రజెండా నాయకత్వంలో బతికినంత కాలం పేద ప్రజల హక్కుల కోసం పోరాడారని తెలిపారు. ప్రధానంగా రైతాంగము, వ్యవసాయ కార్మికులు, వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై అనేక ఉద్యమాలు నడిపాడరన్నారు. గ్రామ సర్పంచిగా గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారన్నారు.ప్రాజెక్టు విషయంలో, నిర్వాసితుల విషయంలో, రైతులకు మార్కెట్ సౌకర్యం కోసం పోరాడారని తెలిపారు. సీపీఎం తీసుకున్న ప్రతి ఉద్యమంలో వారి పాత్ర చాలా గొప్పదన్నారు. అలాంటి నాయకుడు ప్రజల మధ్యన లేకపోవడం ప్రజా ఉద్యమాలకు లోటన్నారు. వారి ఆశయాలను కొనసాగించడానికి వారిని స్మరించుకోవడానికి వారి యొక్క స్మారక స్థూపాన్ని గ్రామంలో నిర్మాణం చేయడం జరిగిందన్నారు. వారి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఈనెల ఆరవ తేదీన స్థూపావిష్కరణతో పాటు బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారప. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలతోపాటు మండల వ్యాప్తంగా ఉన్న రైతులు వ్యవసాయ కూలీలు, కార్మికులు వృత్తిదారులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సభలో రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తో పాటు, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య , సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శి ఎండి. జహంగీర్ , జిల్లా నాయకత్వం పాల్గొని ప్రసంగిస్తారని, ప్రజానాట్యమండలి కళాకారుల కళారూపాలు ప్రదర్శిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు అన్నంపట్ల కృష్ణా, కమిటి సభ్యులు పాండాల మైసయ్య, కొండపురం యాదగిరి పాల్గొన్నారు.




## ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కల పంపిణీ చేసిన సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి, పాలకవర్గం

**సంస్థాన్ నారాయణపురం, ఆగష్టు 03(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు పంపిణీ చేసిన సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి, పాలకవర్గం. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గుత్త ప్రేమ్చందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ, పంచాయతీ కార్యదర్శి నవీన్ కుమార్, 4వ వార్డు మెంబర్ సూరపల్లి వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గునిగంటి రాజు గౌడ్, గ్రామ శాఖ సహాయ కార్యదర్శి రెవనపల్లి గోపాల్, ఫీల్డ్ అసిస్టెంట్ చిలువేరు నరసింహ, మాజీ వార్డ్ మెంబర్ మహమ్మద్ అడ్డు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రసమల్ల గాలయ్య, వడ్డేపల్లి శివప్రసాద్, ఎండి హబ్బు, ఎండి వాజిద్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## ఎంజీఐటీలో ఘనంగా 29వ ఓరియెంటేషన్ డే నిర్వహణ..

### నూతన విద్యార్థులకు స్ఫూర్తిదాయక సందేశాలు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** గండిపేట్లోని మహాత్మా గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ)లో 29వ ఓరియెంటేషన్ డే కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. జేఎన్టీయూహెచ్కు అనుబంధ స్వయంప్రతిపత్తి విద్యాసంస్థ అయిన ఎంజీఐటీలో కొత్తగా చేరిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఆత్మీయ స్వాగతం పలుకుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్. మూర్తి ముఖ్య అతిథిగా హాజరుకాగా, కొటివిటి ఇంజనీరింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శాంతన్ రామసహాయం, నార్సింగి ఎస్హెచ్వో డి. విష్ణువర్ధన్ రెడ్డి గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. చైతన్య భారతి ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యురాలు డి. సంధ్య, అధ్యాపకులు, విభాగాధిపతులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంజీఐటీ వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. సుధాకర్ రెడ్డి విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, పరిశ్రమలు విద్యార్థి అభివృద్ధికి నాలుగు ప్రధాన స్తంభాలని పేర్కొన్నారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి సంస్థలో ఉన్న విద్యా వసతులు, అవకాశాలను వివరించి, తల్లిదండ్రులు పిల్లల విద్యా ప్రగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని, పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఎంజీఐటీ పూర్వ విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో రాణిస్తున్నారని, ఈ నాలుగేళ్ల విద్యార్థి జీవితం భవిష్యత్ విజయాలకు బలమైన పునాదిగా నిలవాలని ఆకాంక్షించారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ బి.ఎస్. మూర్తి విద్యార్థులు ఉద్యోగాల కోసం వెతికేవారిగా కాకుండా ఉద్యోగాలను సృష్టించే జాబ్ క్రియేటర్స్ గా ఎదగాలని సూచించారు. ఆవిష్కరణలు, పరిశోధనలు, స్టార్టప్ల ద్వారా దేశాభివృద్ధికి యువత కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. అవసరమైన ప్రతి సందర్భంలో ఎంజీఐటీతో కలిసి పనిచేయడానికి ఐఐటీ హైదరాబాద్ సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. శాంతన్ రామసహాయం మాట్లాడుతూ ఇంజనీరింగ్లో ప్రాథమిక అంశాలపై పట్టు సాధించాలని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో నిరంతరం నైపుణ్యాలను పెంపొందించుకుంటేనే పరిశ్రమలో రాణించగలరని సూచించారు. నార్సింగి ఎస్హెచ్వో డి. విష్ణువర్ధన్ రెడ్డి విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, డ్రగ్స్, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత లేదా విద్యాపరమైన సమస్యలు ఎదురైతే అధ్యాపకులు, తల్లిదండ్రులు లేదా పోలీసులను సంప్రదించాలని, పోలీసు శాఖ 24 గంటల పాటు సహాయానికి సిద్ధంగా ఉంటుందని తెలిపారు. అలాగే ఎంజీఐటీలో ర్యాగింగ్కు జీరో టాలరెన్స్ పాలసీ అమల్లో ఉందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విద్యా నిబంధనలు, పరీక్షల విధానం, విద్యార్థి సంక్షేమ కార్యక్రమాలు, ర్యాగింగ్ నిరోధక చర్యలు, సురక్షిత క్యాంపస్ ఏర్పాట్లపై అధ్యాపకులు, డైరెక్టర్లు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కన్వీనర్ డాక్టర్ వి. హరిలీల ధన్యవాదాలు తెలపడంతో కార్యక్రమం ముగిసింది. కొత్త విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే సందేశాలతో 29వ ఓరియెంటేషన్ డే విజయవంతంగా ముగిసింది.





## గగన్పాడులో ఘనంగా ఆషాఢ మాస బోనాల ఉత్సవాల ఊరేగింపు

### పాల్గొన్న ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా గగన్పాడు గ్రామంలో నిర్వహించిన పోతురాజుల ఊరేగింపు భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక ప్రార్థనలు చేసిన ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్, గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం తొట్టెల పోతురాజుల ఊరేగింపును ప్రారంభించి భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. బోనాల సంబరాల నేపథ్యంలో గ్రామమంతా భక్తి వాతావరణం నెలకొనగా, పోతురాజుల విన్యాసాలు, డప్పుల చప్పుళ్లు, సంప్రదాయ కళారూపాలు భక్తులను ఆకట్టుకున్నాయి. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎన్. ధనుంజయ్, మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు టి. ప్రేమ్ గౌడ్, సరికొండ వెంకటేష్, కళ్లెం లక్ష్మారెడ్డి, బి. లక్ష్మణ్, జై శివ, జై శ్రీనివాస్, టి. రాజు గౌడ్, చిన్న, టి. రత్నం, మహేష్ గౌడ్, కోట పవన్ కుమార్ నేత, నాని, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి మెర్సిక జన్మదిన వేడుకలు

### పేద చిన్నారులకు అల్పాహార సేవ





**క్రైమ్ మిర్రర్, ఎల్బీనగర్,ఆగస్టు 3:** కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో చిన్నారి మెర్సిక జన్మదినాన్ని పురస్కరించుకుని పేద పిల్లల హాస్టల్లో ప్రత్యేక అల్పాహార సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 300 మంది చిన్నారులకు రుచికరమైన అల్పాహారం అందజేశారు. అనంతరం చిన్నారి మెర్సికతో కేక్ కట్ చేయించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు డాక్టర్ కపిల్ కుమార్ అగర్వాల్ తో పాటు సమితి అధికారులు, సభ్యులు పాల్గొని చిన్నారులకు సేవలందించారు. చిన్నారి మెర్సికకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, సమాజ సేవ పట్ల తమ నిబద్ధతను చాటుకున్నారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ, కృష్ణ గోపాల్ సేవా సమితి ద్వారా అన్నదానం, అల్పాహార పంపిణీతో పాటు వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించాలనుకునే దాతలు, సేవాభిలాషులు సమితి సంప్రదింపు నంబర్ను సంప్రదించాలని కోరారు. ?

## ప్రత్యేక అవసరాల పిల్లలకు మెరుగైన విద్య అందించాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

- క్యాడర్ ప్రత్యేక పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను 100కు పెంచాలి
- ప్రతి విద్యార్థికి దివ్యాంగ పెన్షన్, ఆధార్ కార్డు, క్రమబద్ధమైన హాజరు ఉండేలా చర్యలు తీసుకోవాలి
- క్యాడర్ ప్రత్యేక పాఠశాల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్




**పెద్దపల్లి, జిల్లా క్రైమ్ మిర్రర్ ఆగస్టు-3: న్యూస్:** జిల్లాలో ప్రత్యేక అవసరాల పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్లో క్యాడర్ (జూాణ=జు) ప్రత్యేక పాఠశాల నిర్వహణపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, జిల్లాలో ప్రత్యేక అవసరాల పిల్లల కోసం క్యాడర్ ప్రత్యేక పాఠశాలను 2025 డిసెంబర్ 1న ప్రారంభించినట్లు తెలిపారు. ప్రస్తుతం పాఠశాలలో 45 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, ఈ సంఖ్యను త్వరలోనే 100కు పెంచే లక్ష్యంతో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి వారందరినీ క్యాడర్ ప్రత్యేక పాఠశాలలో చేర్పించేలా గ్రామ, మండల స్థాయిలో చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి దివ్యాంగుల పెన్షన్ అందేలా చూడాలని, ఇప్పటివరకు పెన్షన్ మంజూరు కాని విద్యార్థులు ఎవరైనా ఉంటే వెంటనే అవసరమైన చర్యలు తీసుకుని వారికి పెన్షన్ మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి విద్యార్థికి ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండేలా చూడాలని, ఆధార్లో ఏవైనా తప్పులు లేదా సవరణలు అవసరమైతే వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పత్యేక అవసరాల పిల్లలకు ఒత్తిడి లేని, ఆనందదాయకమైన వాతావరణంలో బోధన అందించాలని, ఆటలు, సృజనాత్మక కార్యక్రమాలు, కార్యాచరణ ఆధారిత అభ్యాసం ద్వారా పిల్లల్లో నేర్చుకునే ఆసక్తిని పెంపొందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థుల క్రమబద్ధమైన హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాలని, తల్లిదండ్రులతో నిరంతరం సంప్రదింపులు నిర్వహిస్తూ పిల్లలు ప్రతిరోజూ పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రత్యేక అవసరాల పిల్లల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్, సీడీపీఓ అలేఖ్య, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గుండాల పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ

## సిబ్బంది కొరత, మందుల లభ్యతపై ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సీరియస్

## డీఎంహెచ్‌వోకు ఫోన్ చేసి వెంటనే సమగ్ర నివేదిక కోరిన ఎమ్మెల్యే

**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, ఆగస్టు 03(క్రైమ్ మిర్రర్ ):** గుండాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి పనితీరును క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై వైద్యాధికారులు, సిబ్బందిని ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. రోగులకు అందుతున్న చికిత్స, మందుల లభ్యత, అత్యవసర వైద్య సేవలు, ఆసుపత్రిలో ఉన్న మౌలిక వసతులను పరిశీలించిన ఆయన, అందుబాటులో ఉన్న మందుల నిల్వలు, వాటి గడువు, అవసరమైన మందులు పూర్తిస్థాయిలో ఉన్నాయా లేదా అనే అంశాలను స్వయంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వైద్యులు, పారామెడికల్ సిబ్బంది కొరతపై వివరాలు సేకరించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం 108 అంబులెన్స్ సేవల పనితీరును సమీక్షించిన బీర్ల అయిలయ్య, అత్యవసర పరిస్థితుల్లో స్పందన





సమయం, ప్రజలకు అందుతున్న సేవల నాణ్యతపై ఆరా తీశారు. అంబులెన్స్ సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో)తో ఫోన్‌లో మాట్లాడిన ఆయన, ఆసుపత్రిలో సిబ్బంది కొరత, మందుల లభ్యత, గడువు ముగిసే మందుల పరిస్థితి, 108 సేవలపై సమగ్ర నివేదికను వెంటనే అందజేయాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లోనూ మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో మెరుగైన వైద్యం అందేలా అధికారులు, వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.



## సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిషనర్ దేశాల భూపాల్‌కు జర్నలిస్టు యూనియన్ నాయకుల ఘన సన్మానం

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) రాష్ట్ర కమిషనర్ దేశాల భూపాల్ను జర్నలిస్టు యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టు యూనియన్ నాయకులు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించే కీలక సాధనమని పేర్కొన్నారు. ప్రజలకు సమాచారం సకాలంలో అందేలా కమిషన్ మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. రాష్ట్ర కమిషనర్ దేశాల భూపాల్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం అమలులో మీడియా పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రజలకు చట్టంపై అవగాహన కల్పించడంలో జర్నలిస్టులు చేస్తున్న సేవలను ఆయన అభినందించారు. పారదర్శక పాలనకు సమాచార హక్కు చట్టం బలమైన వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు యూనియన్ నాయకులు, సభ్యులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని దేశాల భూపాల్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## భీమ్రాజుపల్లి అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు.. తల్లులకు అవగాహన...!

**జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్):** గొల్లపల్లి మండలం ఇబ్రహీంనగర్ సెక్టార్ పరిధిలోని భీమ్రాజుపల్లి అంగన్వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రంలో తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి విస్తృతంగా అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు తాగించాలని, ఆరు నెలల వయస్సు నిండే వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని నిర్వాహకులు తెలిపారు. ఆరు నెలల వరకు తేనె లేదా ఇతర ఎలాంటి ద్రవ పదార్థాలు కూడా పట్టకూడదని స్పష్టం చేశారు. అలాగే, రెండేళ్ల వయస్సు పూర్తి అయ్యేంతవరకు అనుబంధ పోషకాహారంతో పాటు తల్లిపాలను కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ జ్యోతి, అంగన్వాడీ టీచర్ రాజసులోచన, గ్రామ సర్పంచ్ కొలగాని శ్రీలత, ఉప సర్పంచ్ బొమ్మెన రాజమ్మ, పంచాయతీ కార్యదర్శి, గర్భిణులు, బాలింతలు, తల్లులు మరియు పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## శాంతిభద్రతలపై గ్రామస్థులతో ముఖాముఖి..!!

### సూరారం గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

### ప్రజలతో మమేకమైన పోలీసు అధికారులు

### ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ : సీఐ వెంకటేశ్వర్లు

### సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్సై సాంబమూర్తి



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జిల్లా ప్రజలకు పోలీసు శాఖను మరింత చేరువ చేయడం, గ్రామాల్లో శాంతిభద్రతలను పటిష్టం చేయడం, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లక్ష్యంగా గౌరవ జిల్లా ఎస్పీ సిరి శెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు సోమవారం మహాదేవపూర్ మండలంలోని సూరారం గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహాదేవపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, మహాదేవపూర్ ఎస్సై సాంబమూర్తి, పలిమెల ఎస్సై సాయి శశాంక్ పాల్గొని గ్రామ ప్రజలతో ముఖాముఖి సమావేశమయ్యారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు, శాంతిభద్రతల పరిస్థితి, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులు, యువత ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలపై వివరాలు తెలుసుకుని ప్రజల అభిప్రాయాలను స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రజలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ప్రజల సహకారంతోనే నేరాలను అరికట్టడం మరింత సులభమవుతుందని తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా, చట్టవ్యతిరేక కార్యకలాపాలు, అక్రమ రవాణా, మాదకద్రవ్యాల వినియోగం, జూదం, సైబర్ నేరాలు లేదా ఇతర అనుమానాస్పద సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మహిళలు, బాలికలు, వృద్ధులు తమ భద్రతకు సంబంధించిన సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సేవలను వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, సమాజ సేవ వైపు అడుగులు వేయాలని సూచించారు. అదే విధంగా గ్రామాల్లో సామాజిక ఐక్యతను పెంపొందించడం, చిన్నచిన్న వివాదాలను పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకోవడం, శాంతియుత వాతావరణాన్ని కొనసాగించడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని అధికారులు కోరారు. ఈ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం వాహనాల తనిఖీల సందర్భంగా నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న 2 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 24 వాహనాలకు జరిమానాలు విధించారు. అలాగే గుడుంబా విక్రయాలపై ప్రత్యేక దాడులు నిర్వహించి ఒక గుడుంబా కేసు నమోదు చేశారు, గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ చేపడుతున్న చర్యలను గ్రామస్తులు అభినందించారు.

## ముత్తంగి మహిళ అదృశ్యం..

### మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు



పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 03: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ముత్తంగి గ్రామానికి చెందిన తలారి మాధవి (20) అదృశ్యమైన ఘటనపై పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల వివరాల ప్రకారం, ఆగస్టు 3వ తేదీ ఉదయం సుమారు 10 గంటల సమయంలో మాధవి ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆమె భర్త చెన్నయ్య పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదులో నర్సింలు అనే వ్యక్తిపై తనకు అనుమానం ఉన్నట్లు భర్త పేర్కొనడంతో, ఆ కోణంలో కూడా పోలీసులు విచారణ చేపడుతున్నారు. మహిళ ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన పోలీసులు పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. సిసిటివి ఫుటేజీలను పరిశీలించడంతో పాటు బంధువులు, స్నేహితులు మరియు సంబంధిత వ్యక్తులను విచారిస్తున్నారు. మాధవి ఆచూకీపై సమాచారం తెలిసిన వారు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పటాన్చెరు పోలీసులను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.



## నిబంధనలు పాటించకపోతే ప్రమాదమే..!

### గుండాలలో పోలీసుల రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం

### ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలకు చెక్

### యాదగిరిగుట్ట రూరల్ సీఐ శంకర్

**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, ఆగస్టు 03 (క్రైమ్ మిర్రర్):** రోడ్డు ప్రమాదాల్లో ప్రతి రోజు అమాయకులు ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు గుండాల పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో సోమవారం రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహనదారులను నేరుగా కలిసి ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతను వివరించి, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రమాదాలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు. యాదగిరిగుట్ట రూరల్ సీఐ శంకర్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా ఐఎస్ఐ మార్క్ హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ వినియోగించాల్సిందేనని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగంగా ప్రయాణించడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించడం వంటి చర్యలు ప్రాణాంతక ప్రమాదాలకు ప్రధాన కారణాలని హెచ్చరించారు. మైనర్ల చేతికి వాహనాలు ఇవ్వడం చట్టవిరుద్ధమే కాకుండా వారి ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టడమేనని తల్లిదండ్రులకు సూచించారు. ప్రతి వాహనదారుడు రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికేట్ వంటి పత్రాలను వెంట ఉంచుకోవాలని పేర్కొన్నారు. "ఒక్క క్షణం నిర్లక్ష్యం... జీవితాంతం విషాదం" అనే సందేశంతో పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటిస్తేనే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించి విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట రూరల్ సీఐ శంకర్ ఆధ్వర్యంలో గుండాల పోలీస్ స్టేషన్ ఏఎస్ఐలు ప్రకాశ్, వేణుగోపాల్, పోలీసు సిబ్బంది జహంగీర్, శంకర్ పాల్గొని వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.

## తిరుమలాపురం ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా నోట్‌బుక్స్ పంపిణీ..

### దాత చిత్తారి రాజమల్లయ్యకు ఘన సన్మానం..!

**జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్)ూ:** గొల్లపల్లి మండల తిరుమలాపురం గ్రామంలోని పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల (వీూఖూా) లో తిరుమలాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ విద్యాభిమాని చిత్తారి రాజమల్లయ్య రైతు తాను అభ్యసించిన పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందించారు. పాఠశాల విద్యార్థులకు ప్రోత్సాహకంగా సుమారు రూ. 5,000 విలువైన నోట్ పుస్తకాలను ఆయన ఉదారంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలో చదువుతున్న మొత్తం 70 మంది విద్యార్థులకు అవసరమైన 70 హోంవర్క్ డైరీలు, 35 స్క్రిప్ట్ ప్రింట్ నోట్‌బుక్స్ మరియు 35 టేబుల్ బుక్స్ పంపిణీ చేయడం జరిగింది. స్వగ్రామంపై మమకారంతో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు తన వంతు సాయం అందించిన దాత చిత్తారి రాజమల్లయ్యను గ్రామ సర్పంచ్ కాశ అంజలి గంగాధర్, గ్రామ ఉపసర్పంచ్ మస్కం ఆంజనేయులు, గ్రామ వార్డు సభ్యులు నరేష్ మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించి, సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు గ్రామస్తులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. తమ పాఠశాలపై ప్రత్యేక అభిమానంతో సహాయం అందించిన చిత్తారి రాజమల్లయ్యకు వారందరూ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## మైలార్‌దేవ్‌పల్లిలో ఘనంగా ఆషాఢమాసం బోనాలు

ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్‌రెడ్డి

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని పలు కాలనీలో ఆషాఢమాం బోనాల ఉత్సవాలను పురస్కరించుకోని అమ్మావరి తొట్టెల ఊరేగింపు కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి చల్లని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ పూజల్లో దేవాలయాల కమిటీ సభ్యులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



# ఆత్మీయ వాతావరణంలో ఘనంగా క్రైమ్ మిర్రర్ పాత్రికేయుడు పంతం వెంకటేష్ పటేల్ జన్మదిన వేడుకలు

### శాలువాతో సన్మానం.. కేక్ కట్.. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపిన స్నేహితులు, సహపాత్రికేయులు, నాయకులు







**కూకట్‌పల్లి, అగస్ట్ 03 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వెంకటేశ్వర నగర్ డివిజన్ పరిధి పాపిరెడ్డి నగర్ కాలనీలో నివాసముంటున్న క్రైమ్ మిర్రర్ పాత్రికేయుడు పంతం వెంకటేష్ పటేల్ జన్మదిన వేడుకలు సోమవారం ఆత్మీయ వాతావరణంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. పాపిరెడ్డి నగర్ పార్క్‌లో జరిగిన ఈ వేడుకలకు స్నేహితులు, సహ పాత్రికే యులు, సామాజిక కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకల సందర్భంగా పంతం వెంకటేష్ పటేల్‌తో కేక్ కట్ చేయించి, పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమం మొత్తం స్నేహపూర్వక వాతావరణంలో ఆనందోత్సాహాల మధ్య కొనసాగింది. ఈ సందర్భంగా మాట్లాడిన స్నేహితులు, సహపాత్రికేయులు మాట్లాడుతూ, పంతం వెంకటేష్ పటేల్ సమాజ సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువస్తూ, ప్రజా ప్రయోజనాలకు అంకితభావంతో పాత్రికేయ సేవలు అందిస్తున్నారని కొనియాడారు. క్రైమ్ మిర్రర్ దినపత్రిక ద్వారా ప్రజలకు ఉపయోగపడే వార్తలు, సామాజిక చైతన్యాన్ని పెంపొందించే కథనాలు ప్రచురిస్తూ పాత్రికేయ రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. అలాగే ఆయన వృత్తి జీవితంలో మరిన్ని విజయాలను అందుకోవాలని, ప్రజల విశ్వాసాన్ని మరింతగా చూరగొనాలని ఆకాంక్షించారు. ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ సమాజ సేవలో ముందుండాలని మనస్ఫూర్తిగా అభిలషించారు. అనంతరం పంతం వెంకటేష్ పటేల్ మాట్లాడుతూ, తన జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రత్యక్షంగా వచ్చి శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ, ఫోన్, సందేశాలు, సామాజిక మాధ్యమాల ద్వారా శుభాకాంక్షలు అందించిన మిత్రులు, బంధువులు, సహచర పాత్రికేయులు, నాయకులు, అభిమానులందరికీ హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తమపై చూపుతున్న ప్రేమాభిమానాలు, ఆదరణ జీవితాంతం మరువలేనివని పేర్కొన్నారు. ఈ జన్మదిన వేడుకలు స్నేహబంధాలను మరింత బలోపేతం చేస్తూ, ఆత్మీయ అనుబంధాలకు నిదర్శనంగా నిలిచాయని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు. కార్యక్రమం ముగింపులో అందరూ కలిసి పంతం వెంకటేష్ పటేల్‌కు మరోసారి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, ఆయన మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# జగిత్యాల అర్బన్: ఘనంగా తల్లిపాల వారోత్సవాలు..

### తల్లులకు అవగాహన కార్యక్రమం...!



**జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్):** జగిత్యాల అర్బన్ 2 సెక్టార్ పరిధిలోని 13వ వార్డులో సోమవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ సిరికొండ వరలక్ష్మి శ్రీనివాస్ అధ్యక్షతన, సీడీపీఓ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టించాలని అధికారులు, నిర్వాహకులు తల్లులకు అవగాహన కల్పించారు. లేత పసుపు రంగులో జిగుటగా ఉండే ముర్రుపాలు బిడ్డకు వ్యాధి నిరోధక టీకా లాగా పనిచేస్తాయని, ఇది దేవుడిచ్చిన వరమని తెలిపారు. తల్లి పాలలో లాక్టోస్ అనే తీయని పదార్థంతో పాటు 80 శాతం నీరు ఉంటుందని, ఆ ఒక్క చుక్క అమృతంతో సమానమని పేర్కొన్నారు. పుట్టిన మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లులకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా నివారించవచ్చని తెలిపారు. ప్రసవం తర్వాత అధిక రక్తస్రావం జరగకుండా అడ్డుకోవచ్చని, బిడ్డను హత్తుకుని పాలు ఇవ్వడం వల్ల తల్లికి, శిశువుకు మధ్య మంచి అనుబంధం ఏర్పడుతుందని వివరించారు. అంతేకాకుండా, పిల్లలకు ఎలాంటి జబ్బులు, విరేచనాలు, వాంతులు, శ్వాసకోశ వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. శిశువుకు సరిగ్గా పాలు పట్టించే విధానం, బాబు పాలు తాగుతున్నాడా లేదా అని గుర్తించే మెలకువలు, అవసరమైనప్పుడు ఎన్నిసార్లు అయినా పాలు పట్టవచ్చనే విషయాలపై తల్లులకు అవగాహన కల్పించి క్విజ్ నిర్వహించారు. క్విజ్ ప్రశ్నలకు తల్లులు ఉత్సాహంగా సమాధానాలు చెప్పారు. తల్లిపాల విజయానికి కుటుంబ సభ్యుల సహకారం ఎంతో అవసరమని, తల్లులకు తగిన విశ్రాంతి, పౌష్టికాహారం అందేలా కుటుంబ సభ్యులు బాధ్యత తీసుకోవాలని కోరారు. మొదటిగా విసర్జించే 'మేకొనియం' అనే మలంతో పాటు పచ్చకామెర్లు కలిగించే 'బిలుర్బిన్' అనే పదార్థం బయటకు వెళ్లి, మొదటి వారం వచ్చే పచ్చకామెర్ల తీవ్రత తగ్గుతుందని తెలిపారు. తల్లి పాలలో ఏ విటమిన్ ఉండటం వల్ల శిశువు కళ్ళు మెరుస్తూ ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సిరికొండ వరలక్ష్మి శ్రీనివాస్, సీడీపీఓ జయప్రద, సూపర్వైజర్ మమత, వార్డు ఆఫీసర్ మహిపాల్, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, కల్పన, ఇంద్రజ, లక్ష్మి, గంగ భవాని, ఆశా వర్కర్ గంగ, ఏఎన్ఎం నర్సుతో పాటు పెద్ద సంఖ్యలో తల్లులు, పిల్లలు, అమ్మమ్మలు, నానమ్మలు, తాతలు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బోనాల పండుగ

### రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ల పరిధిలోని వివిధ కాలనీలలో ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి వివిధ కాలనీల దేవాలయాలను సందర్శించి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఘటాల ఊరేగింపు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, భక్తిభావానికి బోనాల పండుగ నిదర్శనమన్నారు. అమ్మవారి దయాకటాక్షాలతో రాజేంద్రనగర్ నియోజకవర్గం ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కాలనీల్లో ప్రజలు పండుగను ఇంతటి ఉత్సవాంతో సోదరభావంతో జరుపుకోవడం సంతోషకరమన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి ఊరు, ప్రతి కాలనీ అభివద్ధి చెందడమే మనందరి లక్ష్యమన్నారు. ఈ పూజల్లో కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షులు గుమ్మడి కుమార్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కోలాన్ సుభాష్ రెడ్డి, శీలం తిరుపతిరెడ్డి, ధర్మారెడ్డి, రమేష్‌ముదిరాజ్, నోముల రాముయాదవ్, మైలార్ దేవ్ పల్లి డివిజన్ యువజన అధ్యక్షులు అక్కెం రాఘవేందర్‌యాదవ్, రాజేష్‌యాదవ్, మైసిరెడ్డి, దుర్గేష్, కార్మిక శాఖ విభాగ్ అధ్యక్షులు ఉప్పల్ శ్రీను, ప్రవీణ్, వెంకటరమణ, సునీల్, మహేష్, సంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, అఖిల్, నిఖిల్, నితిన్, చిరు, పవన్, అనిల్, చిన్న, కొన్ని, సోను, దీపు, గాంధీ, పవన్, చింటూ, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# గండిపేట మండల టీయూడబ్ల్యూజే నూతన కమిటీ ఎన్నిక

### నూతన అధ్యక్షుడిగా రాముయాదవ్ ఏకగ్రీవ ఎన్నిక

### జర్నలిస్టుల హక్కులు, సంక్షేమమే లక్ష్యం-రాష్ట్ర టీయూడబ్ల్యూజే కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ గండిపేట మండల నూతన కార్యవర్గ ఎన్నిక సోమవారం ఏకగ్రీవంగా జరిగింది. నార్సింగి సర్కిల్ పరిధిలోని మంచిరేవుల ప్రజాభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భీమయ్య, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సలీం పాషా, జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి ఆలేటి రాజేందర్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు దుద్దాల రాజు, పగిడిమర్రి సూర్యనారాయణ హాజరయ్యారు. వారి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల కుటుంబాల ఆరోగ్య భద్రత, డబుల్ బెడ్‌రూమ్ గృహాల కేటాయింపు, అక్రిడేషన్ సమస్యలు, సంక్షేమ పథకాల అమలుపై రాష్ట్ర ప్రభుత్వంతో యూనియన్ నిరంతరం చర్చలు జరుపుతోందన్నారు. మండల స్థాయిలో అక్రిడేషన్ రాని జర్నలిస్టులకు మళ్లీ ధరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించేందుకు సంబంధిత అధికారులతో చర్చలు కొనసాగుతున్నాయన్నారు. విధి నిర్వహణలో జర్నలిస్టులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారి భద్రత, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకోని లైఫ్ ఇన్సూరెన్స్? వంటి పథకాలను అమలు చేయాలి, ఇందు కోసం ప్రతి ప్రాంతంలో జర్నలిస్టుల సంక్షేమ నిధిని ఏర్పాటు చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ కారక్రమానికి రాష్ట్ర కార్యవర్గం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సలీం పాషా మాట్లాడుతూ సమిష్టి నిర్ణయాలతో జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, అభివృద్ధి కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ శక్తివంచన లేకుండా పని చేస్తుందని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో మండల కమిటీలను ఏర్పాటు చేసి అనంతరం నియోజకవర్గ కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. జర్నలిస్టులు ఐక్యంగా ఉంటేనే తమ హక్కులనుసాధించుకోగలరని, సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టులు ఆరోగ్య భద్రత కోసం ప్రత్యేక సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన గండిపేట మండల అధ్యక్షులు జి.రాముయాదవ్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకానికి సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర, జిల్లా నాయకత్వం ఆదేశాల మేరకు మండలంలోని ప్రతి జర్నలిస్టు సంక్షేమం కోసం కృషి చేస్తానని, వారి సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం నిరంతరం పని చేస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ యూనియన్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.



ప్రధాన కార్యదర్శి శిరందాస్ నరేందర్



అధ్యక్షులు రాము యాదవ్

**నూతన కార్యవర్గం...**

అధ్యక్షులుగా జి.రాముయాదవ్(వార్త), ఉపాధ్యక్షులుగా గోపాల్(సూర్య), టి.సత్యం(సాక్షి), బి.ప్రవీణ్‌యాదవ్ (దిశ), ప్రధాన కార్యదర్శి ఎస్.నరేందర్(తెలుగు ప్రభ), కోశాధికారి పి.నర్సింలు, సంయుక్త కార్యదర్శులు ఎ.శివకుమార్(ప్రజా సాక్షి), ఎస్.ప్రభాకర్(మన తెలంగాణ), జి.నరేష్‌కుమార్(నవ తెలంగాణ), ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.విజయ్‌కుమార్(ఆంధ్రప్రభ), కార్యవర్గ సభ్యులు ఎన్.రామకృష్ణ (క్యూ న్యూస్), ఈసీ సభ్యులు విజయ్ ప్రతాప్, దాసరి రవికుమార్, లక్ష్మీనారనాయణ, కోట శ్యామ్‌కుమార్, సుగ్రీవ్, గౌరవ సలహాదారులు ఆలేటి రాజేందర్‌రెడ్డి, దుద్దాల రాజు, జెట్టి విష్ణు, నీలి సత్యకుమార్‌లు ఉన్నారు. కార్యక్రమంలో గండిపేట మండలానికి చెందిన పలువురు జర్నలిస్టులు పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు. నూతన కమిటీ నాయకత్వంలో జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాలు మరింత బలోపేతం అవుతాయని సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# నేక్నాంపూర్ బాపు హిల్స్‌లో కొండచిలువ కలకలం..

### స్ట్రీట్ లైట్లు లేక ప్రజల్లో భయాందోళన





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నేక్నాంపూర్ బాపు హిల్స్ కాలనీలో కొండచిలువ కనిపించడం స్థానికుల్లో తీవ్ర భయాందోళనకు దారితీసింది. ఇప్పటికే స్ట్రీట్ లైట్లు పనిచేయక రాత్రివేళల్లో చీకటితో ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు, ఇప్పుడు పాముల సంచారంతో మరింత ఆందోళన చెందుతున్నారు. ప్రజల భద్రతకు ముప్పుగా మారిన ఈ పరిస్థితిపై అధికారులు తక్షణమే స్పందించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. స్థానికుల వివరాల ప్రకారం సోమవారం మధ్యాహ్నం కాలనీలోని ఓ ప్రాంతంలో భారీ కొండచిలువ సంచరిస్తూ కనిపించింది. దానిని చూసిన స్థానికులు ఒక్కసారిగా భయంతో పరుగులు తీశారు. అప్రమత్తమైన కొందరు దూరం నుంచే గమనిస్తూ సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. కాలనీకి సమీపంలో ఉన్న ఖాళీ స్థలాలు, దట్టమైన పొదలు పాములకు ఆశ్రయంగా మారాయని స్థానికులు చెబుతున్నారు. గతంలో కూడా చిన్న చిన్న పాములు తరచూ కనిపించేవని, ఇప్పుడు ఏకంగా కొండచిలువ దర్శనమివ్వడంతో చిన్నారులను బయట ఆడుకునేందుకు పంపాలన్నా, మహిళలు, వృద్ధులు రాత్రి సమయంలో బయటకు రావాలన్నా భయపడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాముల భయానికి తోడు కాలనీలో స్ట్రీట్ లైట్ల సమస్య మరింత ఆందోళన కలిగిస్తోంది. ఒకటి, రెండు వీధి దీపాలు మినహా మిగతా లైట్లు చాలా కాలంగా పనిచేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో వీధులన్నీ పూర్తిగా చీకటిగా మారిపోతుండటంతో పాములు, ఇతర విషజంతువులు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. అంతేకాకుండా చీకటిని ఆసరాగా చేసుకుని దొంగతనాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రమాదం కూడా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ, ఈరోజు వేస్తాం... రేపు వేస్తాం అంటూ హామీలు ఇవ్వడం తప్ప ఇప్పటి వరకు శాశ్వత పరిష్కారం చూపలేదని కాలనీవాసులు మండిపడుతున్నారు. ప్రజల భద్రత దృష్ట్యా పనిచేయని స్ట్రీట్ లైట్లను వెంటనే మరమ్మతు చేయడంతో పాటు అవసరమైన చోట కొత్త వీధి దీపాలను ఏర్పాటు చేయాలని, కాలనీ పరిసరాల్లోని పొదలను తొలగించి పాముల సంచారాన్ని అరికట్టాలని, అటవీశాఖ మరియు జీహెచ్ఎంసీ అధికారులు సంయుక్తంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. సమస్య మరింత తీవ్రరూపం దాల్చకముందే అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పలు మహిళల సమస్యల పై మహిళా కమిషన్ కు

# మహిళా సంఘం ఆధ్వర్యంలో ఫిర్యాదు



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** పలువురు మహిళల పలు అంశాలపై వీరనారీమణుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర రాజధాని హైదరాబాదులో గల రాష్ట్ర మహిళ కమిషన్ లో ఫిర్యాదు చేశారు. మహిళా కమిషన్ సభ్యురాలు చిట్యాల శ్వేత కు సంఘం అధ్యక్షురాలు భూక్య ఉపేంద్ర బాయి ఈ మేరకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వీరనారీమణుల ఆశయ సాధన సమితి ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్ర బాయి మాట్లాడుతూ జిల్లాలోని రఘునాథపాలెం మండలం పువ్వాడ ఉదయ్ నగర్ ప్రాంతానికి చెందిన వివాహిత షేక్. జాహిదా బేగం ను ఆమె భర్త ఇస్మాయిల్ కాపురానికి తీసుకొని వెళ్లకపోవడం , శారీరిక మానసిక హింసలు పెట్టడం పై పోలీసు కేసులు నమోదు కావటం అనంతరం పెద్దమనుషుల సమక్షంలో ఆమెకు న్యాయం చేస్తామని ఉద్దేశంతో ఆమెకు ఒక ప్లాటు రాసి ఇవ్వటం పిల్లల పోషణ పోషణ నిమిత్తం ప్రతినెల కొంత డబ్బులు ఇవ్వడం తాకట్టు పెట్టిన ఆమె నగలు విడిపించి అప్పగించడం పై మహిళ కమిషన్ దృష్టి సారించి , ఆమె కు న్యాయం చేయాలని అన్నారు. ఇదే పువ్వాడ ఉదయ నగర్ లో కాశ పోయిన అలివేలు మంగ, ఓర్సు రంగమ్మ,బత్తుల సుభద్ర,, బత్తుల నాగేంద్ర, జోగు భాగ్యమ్మ లతో వందనపు రత్నాకుమారి మధ్య జరిగిన వివాదంలో కోర్టులో కేసు నడుస్తుండగా... ఏ మాత్రం సంబంధం లేని భూక్య ఉపేంద్ర బాయి నోటీసు పంపడం పై మహిళా కమిషన్ దృష్టి పెట్టి తగిన న్యాయం చేకూర్చాలన్నారు. రత్న కుమారి అనే మహిళ పువ్వడ ఉదయ నగర్ లో అక్రమ నిర్మాణం చేపట్టిన అంశంపై ప్రశ్నించి నందుకుగాను ఉపేంద్ర బాయి పై కేసు పెట్టడం జరిగిందని తెలిపారు.జిల్లా కేంద్రమైన ఖమ్మం లో గల రామచంద్రయ్య నగర్ ప్రాంతానికి చెందిన బానోతు కళావతి పైనే కాకుండా ఆమె తమ్ముడు వీరన్న, అక్క ఈరమ్మ తల్లి ధ్వలి , అత్త బుజ్జి లను అమానుషంగా, అకారణంగా విచక్షణ రహితంగా కర్రలతో దాడులకు పాల్పడిన నిందితులు నరేష్ ఆయన భార్య కావ్య, స్నేహితులు వంశీ, నవీన్ , వంశీ తల్లి లక్ష్మి లపై న్యాయ విచారణ జరిపి చదివి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పువ్వాడ ఉదయ నగర్ లోనే గత 11 సంవత్సరాల నుండి నివాసం ఉంటున్న ఏ. యమున, యం. వనజ, ఏ. కళావతి, ఏ. సరోజిని, కే రేణుక బి. శ్రీకాంత్, బి. నాగేంద్ర లకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని, వాటికి వెంటనే ఇంటి నెంబర్లు కూడా మంజూరు చేయాలని , ఈ విషయంలో మహిళా కమిషన్ సానుకూలంగా స్పందించి, తగిన చర్యలు చేపట్టాలన్నారు. మహిళా కమిషన్ సభ్యురాలు చిట్యాల శ్వేతకు వినతి పత్రం సమర్పించిన బృందంలో బాధితులు కళావతి, ఈరమ్మ, బుజ్జి తో పాటు వీరనారీమణుల ఆశయ సాధన సమితి సభ్యురాలు నాగమణి తదితరులు పాల్గొన్నారు.



## బాధితులకు కొండంత అండగా పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచనల మేరకు తిరుమలాయపాలెం మండలంలో పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జూలై 1 నుంచి జూలై 31 వరకు వివిధ కారణాలతో మరణించిన మొత్తం 60 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ. 10,000 చొప్పున. మొత్తం రూ. 6 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మండల పరిధిలోని తిరుమలాయపాలెం, బాలాజీనగర్ తండా, పిండిప్రోలు, తెట్టెలపాడు, కేశవాపురం, తిప్పారెడ్డిగూడెం, అజ్మీరా తండా, జల్లెపల్లి, హైదర్‌సాయిపేట, పాతర్లపాడు, గోల్‌తండా, చంద్రుతండా, మేకలతండా, మేడిదపల్లి, మహ్మదాపురం, ఇస్లావత్‌తండా, రఘునాథపాలెం, కాకరవాయి, జూపెడ, రాజారం, బచ్చోడుతండా, బచ్చోడు, బీరోలు, ఏలువారిగూడెం, దమ్మాయిగూడెం, ఎర్రగడ్డ తండా మొత్తం 26 గ్రామాల్లో బాధితుల ఇళ్లకు వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించి ఈ సహాయాన్ని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ... ప్రతి నెల క్రమం తప్పకుండా పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా బాధితులకు ఆర్థిక సాయం అందిస్తూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కొండంత అండగా నిలుస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పొంగులేటి అభిమానులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకొని త్వరితగతిన పరిష్కరిస్తున్న జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్...!

**జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్) :** జిల్లా ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడం, బాధితుల సమస్యలను నేరుగా తెలుసుకొని త్వరితగతిన పరిష్కరించడం లక్ష్యంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా, సోమవారం రోజున జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రజల నుండి వచ్చిన పలు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 26 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను ఎస్పీ కి నేరుగా వివరించారు. ప్రతి ఫిర్యాదుదారుడి సమస్యను జిల్లా ఎస్పీ తెలుసుకొని సంబంధిత పత్రాలను పరిశీలించి ప్రతి ఫిర్యాదును న్యాయబద్ధంగా, పారదర్శకంగా విచారించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలో పరిష్కరించగల సమస్యలను ఆలస్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని, విచారణ ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. జిల్లా పోలీసు శాఖ ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలను అందించేందుకు కట్టుబడి ఉందని, ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తోందని ఎస్పీ తెలిపారు.

## పలు సమస్యలపై 60 వినతులు స్వీకరించిన జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్...!




**జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్):** ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా సోమవారం రోజున నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 60 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం బ్రహ్మ కుమారీస్ వారి ఆధ్వర్యంలో నాషా విముక్తి భారత్ కార్యక్రమం లో భాగంగా 10 కోట్ల మంది వ్యసన విముక్తి ప్రతిజ్ఞ చేసి పోస్టర్ ఆవిష్కరణ చేశారు. జిల్లా సంక్షేమ శాఖ వారి తల్లిపాల వారోత్సవాల పోస్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ వారి తెలంగాణ జలసిరి (ఎల్ నినో ప్రభావం – వర్ష బాగా పరిస్థితులను ఎదుర్కొందాం ) పోస్టర్ లను ఆవిష్కరణ జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లు బి. ఎస్. లత, బి. రాజ గౌడ్, జిల్లా రెవెన్యూ అధికారి ప్రసాద్, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు మరియు తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్




సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 03: ఆగస్టు 15న నిర్వహించే జిల్లా స్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జాతీయ స్ఫూర్తిని ప్రతిబింబించేలా ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే వేడుకలకు వేదిక, అతిథుల సీటింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర అంశాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా జిల్లా ప్రగతి నివేదికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రోటోకాల్ నిబంధనలను పాటిస్తూ ప్రజాప్రతినిధులు, విశిష్ట అతిథులకు ఆహ్వానాలు పంపాలని, విద్యార్థులతో దేశభక్తిని చాటే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాల ప్రదానం కోసం శాఖల వారీగా ప్రతిపాదనలు నిర్ణీత గడువులోగా సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీఓలు తదితరులు పాల్గొన్నారు.

## సీతమ్మసాగర్ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలి



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి నదిపై నిర్మిస్తున్న సీతమ్మసాగర్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన సీతమ్మసాగర్ ప్రాజెక్టు పురోగతిపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రులు పొంగులేటి , పొన్నం ప్రభాకర్, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, సీతమ్మసాగర్ ప్రాజెక్టు ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న అత్యంత కీలకమైన సాగునీటి ప్రాజెక్టు అని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలతో పాటు పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ రంగానికి కొత్త ఊపు వస్తుందని అన్నారు. నిర్దేశిత గడువులోపు ప్రాజెక్టును పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి రైతులకు అంకితం చేయాలనే లక్ష్యంతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు.



## ఐక్యతకు నిదర్శనం పులిపాటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్

### పులిపాటి నగర్ లో ఘనంగా స్నేహితుల దినోత్సవ వేడుకలు

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఐక్యత ఆప్యాయతలకు నిదర్శనం పులిపాటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అని అసోసియేషన్ చైర్మెన్ పులిపాటి విద్యాసంస్థల చైర్మెన్ డాక్టర్ పులిపాటి ప్రసాద్ అన్నారు. ఆదివారం రాత్రి తన నివాస ఆవరణలో జరిగిన స్నేహితుల దినోత్సవ వేడుకలు అంబరానంటాయి.ఈ సందర్భంగా డాక్టర్ పులిపాటి ప్రసాద్ మాట్లాడుతూ మీ అందరి ఆదరభిమానాలు ఉన్నంత వరకు ఆప్యాయత అనురాగాలతో పులిపాటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అభివృద్ధిలో ముందంజలో ఉందని ఆయన అన్నారు. వేదికలు ఏమైనప్పటికీ మీరు చూపుతున్న ప్రేమాభిమానాలు వెలకట్టలేనివని అందుకే ఫ్రెండ్షిప్ డే గా పరిగణించబడుతుందనీ ఆయన అన్నారు. భవిష్యత్ లో పట్టభద్రుల ఎమ్మెల్సీ అంశంలో అందరి విజ్ఞప్తి మేరకు తాను పోటీ చేసేందుకు నిర్ణయం ఆనాడు తీసుకుంటానని ప్రస్తుతం తన విద్యాసంస్థలతో లక్షలాదిమంది విద్యార్థులకు ఉన్నత విద్యార్థులుగా తీర్చి దిద్దడం జరిగిందని రాబోవు రోజుల్లో ప్రజాసేవకు అంకితమవుతానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పట్నాయక్ వెంకటేశ్వరరావు మాధవరావు శ్రీనివాసరావు పవన్ వీరభద్రం అనంతరెడ్డి అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్షులు దిలీప్ చౌదరి యోగేష్ ఖమ్మం పౌర సమితి జనరల్ సెక్రటరీ ఖాసీం కార్యదర్శి బుగ్గవరపు సతీష్ గోళ్ల రాధాకృష్ణ మూర్తి గుమ్మడవెల్లి శ్రీను వరప్రసాద్ వీరభద్రం బుర్ల పుల్లారావు కొల్లా రామారావు మజీదు ఎండి హాకీమ్ హబీబ్ మంత్రి ప్రగడ జగన్మోహన్రావు బద్రునాయక్ ఉపేందర్ ప్రవీణ్ కృష్ణ పురుషోత్తం కాజా వెంకటేశ్వరరావు మాశెట్టి ప్రసాద్ ఉష సీనియర్ జర్నలిస్టులు షేక్ జానిపాషా టిఎస్ చక్రవర్తి భద్రం తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీల సహకారంతో ఎస్ఐఆర్ విజయవంతం చేయాలి: సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 03: జిల్లాలో కొనసాగుతున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, విజయవంతంగా పూర్తి చేసేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు క్రియాశీలకంగా సహకరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రక్రియను మరింత పటిష్ఠంగా నిర్వహించడంలో రాజకీయ పార్టీల సూచనలు, సహకారం కీలకమని ఆయన పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా డిజిటలైజేషన్ పురోగతి, ఓటరు జాబితా సవరణ, పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ తదితర అంశాలపై ప్రతినిధుల నుంచి సూచనలు స్వీకరించారు.భారత ఎన్నికల సంఘం ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణ గడువును ఆగస్టు 10 వరకు పొడిగించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లు తమ బూత్ స్థాయి అధికారి సూచనలు చేశారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, ఈఆర్‌వోలు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# మల్యాలలో విషాదం.. కుంటలో పడి ఇద్దరు విద్యార్థుల మృతి...!

## పరామర్శించిన ఎమ్మెల్యే డా. సంజయ్, జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్.. సమగ్ర విచారణకు ఆదేశం..!

**జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్):** మల్యాల మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ ఒడ్డెర కాలనీ పాఠశాలలో చదువుతూ, సమీకృత బాలుర వసతి గృహంలో ఉంటున్న ఇద్దరు విద్యార్థులు ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెందడం అత్యంత విషాదకరమని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జగిత్యాల ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని సందర్శించిన ఆయన, మృతి చెందిన విద్యార్థుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ దుర్ఘటనపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మల్యాలలోని ఎంపీపీఎస్ ఒడ్డెర కాలనీ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు విరామ సమయంలో ఎవరికీ ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పాఠశాల ఆవరణ నుంచి బయటకు వెళ్లినట్లు తెలిపారు. కొంతసేపటి తర్వాత వారు పాఠశాలకు తిరిగి రాకపోవడంతో ప్రధానోపాధ్యాయుడు, హాస్టల్ వార్డెన్, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు గాలింపు చర్యలు చేపట్టారన్నారు. గాలింపు సమయంలో పాఠశాల, హాస్టల్‌కు సమీపంలోని కొత్తకుంట వద్ద విద్యార్థుల దుస్తులు కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించామని తెలిపారు. అనంతరం పోలీసు శాఖ, మత్స్యశాఖ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లతో కలిసి కుంటలో గాలింపు చేపట్టగా.. దురదృష్టవశాత్తు ఇద్దరు విద్యార్థులు మృతి చెందినట్లు గుర్తించి మృతదేహాలను వెలికితీశామని, పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర విచారణ జరపాలి: కలెక్టర్ఈ ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర విచారణ నిర్వహించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సంఘటనకు దారితీసిన పరిస్థితులను పూర్తిస్థాయిలో పరిశీలించి నివేదిక సమర్పించాలని సూచించిన ఆయన.. విచారణలో ఎవరి నిర్లక్ష్యం ఉన్నా నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, ప్రభుత్వం తరపున అందాల్సిన సహాయాన్ని అందించేందుకు తక్షణ చర్యలు



తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కుటుంబాలకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్అనంతరం జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ ఘటన తీవ్రంగా కలచివేసిందని, అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. విచారణలో విధుల్లో నిర్లక్ష్యం తేలితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి మరియు రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి, బాధిత కుటుంబాలకు ప్రభుత్వపరంగా తగిన న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజ్‌కుమార్, డీఈఓ రాము, ఇతర పోలీసు, రెవెన్యూ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు మరియు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## తిమ్మరెడ్డిగూడలో అంగరంగ వైభవంగా పోచమ్మ తల్లి బోనాల జాతర

**క్రైమ్ మిర్రర్ షాబాద్:** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలోని తిమ్మరెడ్డిగూడ గ్రామంలో గ్రామదేవత శ్రీ పోచమ్మ తల్లి బోనాల జాతర భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో అలంకరించుకుని తలపై బోనాలు ఎత్తుకుని మంగళ వాయిద్యాలు, డప్పు చప్పుళ్లు, భక్తి గీతాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఊరేగింపు అంతటా శివసత్తులు పూనకాలతో భక్తులను ఆకట్టుకోగా, పోతురాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ కుటుంబాలు సుఖశాంతులతో ఉండాలని, గ్రామంపై అమ్మవారి కటాక్షం ఎల్లప్పుడూ ఉండాలని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. గ్రామ యువకులు, పెద్దలు ఉత్సవాల నిర్వహణలో చురుకుగా పాల్గొని ఏర్పాట్లు చేశారు. భక్తులకు తాగునీరు, ప్రసాదం తదితర సౌకర్యాలు కల్పించారు. పోచమ్మ తల్లి బోనాల వేడుకలు గ్రామంలో భక్తి, ఆధ్యాత్మికత, సంప్రదాయ సంస్కృతికి ప్రతీకగా నిలిచి, గ్రామస్తులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చిన పండుగగా విజయవంతంగా ముగిశాయి.

## అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలి

### జిల్లా కలెక్టర్ కి టీజేఏ ఖమ్మం జిల్లా కమిటీ వినతి



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలని తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ) ఖమ్మం జిల్లా అధ్యక్షులు జి నాగ స్వామి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్.కు వినతిపత్రం అంద చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. టీజేఏ జిల్లా అధ్యక్షులు నాగస్వామి మాట్లాడుతూ సమాజానికి సమాచారాన్ని అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టులకు సొంత ఇంటి కల నెరవేరేలా ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని అన్నారు. అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు వివక్ష లేకుండా ఇళ్ల స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గత రెండు దశాబ్దాలుగా (20 ఏళ్లుగా) పరిష్కారానికి నోచుకోకుండా పెండింగ్‌లో ఉన్న అర్హులైన జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు అర్హులైన ప్రతి విలేకరికీ తక్షణమే ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. పెరుగుతున్న ధరల కాలంలో జర్నలిస్టులు ఇండ్ల అద్దెలు కట్టలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎజీూ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు దశాబ్దాలుగా ఇళ్ల స్థలాల కోసం పోరాటం చేస్తున్నప్పటికీ జర్నలిస్టుల నిరీక్షణ ఇంకా కొనసాగుతూనే ఉందని పేర్కొన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ పారదర్శకంగా ఇళ్ల స్థలాలు కేటాయించి వారి కుటుంబాలకు నివాస ధీమా కల్పించాలని టిజేఏ ప్రతినిధులు ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని జిల్లా యంత్రాంగాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో టీజేఏ జిల్లా గౌరవ అధ్యక్షులు కొమ్మమూరు మణికుమార్ జిల్లా అధ్యక్షుడు జి. నాగస్వామి జిల్లా కార్యదర్శి మత్తి రామకృష్ణ జిల్లా నాయకులు సయ్యద్ ఖాసీం వాసం రాజేంద్ర ప్రసాద్ రాము రమేష్ సతీష్ సిహెచ్ రాంబాబు పాల్గొన్నారు.

## బీవీఆర్ఐటీలో ఘనంగా 30వ ఇండక్షన్ డే వేడుకలు

### నూతన విద్యార్థులకు ఘన స్వాగతం, విలువలతో కూడిన విద్యపై ప్రముఖుల పిలుపు




నర్సాపూర్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 03: బీవీ రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నర్సాపూర్‌లో బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థుల కోసం 30వ ఇండక్షన్ డే కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు కె. విష్ణు రాజు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను కళాశాల కుటుంబంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు సోషల్ మీడియా, కృత్రిమ మేధస్సు వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, సాంకేతికతను అభ్యాసానికి ఉపయోగించుకోవాలని సూచించారు. వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ మాట్లాడుతూ.. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలిపారు. ప్రిన్సిపాల్ డా. సంజయ్ దూబే బీవీఆర్ఐటీ ప్లేస్‌మెంట్లు, పరిశోధన, జాతీయ స్థాయి విజయాల గురించి వివరించగా, డైరెక్టర్ డా. కె. లక్ష్మీ ప్రసాద్ విలువలతో కూడిన విద్య, వ్యక్తిత్వ వికాసానికి కళాశాల ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించి పుస్తకాలు బహూకరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సిఆర్టిలతో పాటు ఇన్ స్ట్రక్చర్ ఉపాధ్యాయులకు వేతనాలు అందించాలి

### ఇన్ స్ట్రక్చర్ ఉపాధ్యాయుల జిల్లా అధ్యక్షులు రాజేందర్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్

### జిల్లా కలెక్టర్ దీపక్ తివారి డిటిడిఓ జనార్దన్ కు వినతి పత్రం సమర్పించిన ఉపాధ్యాయులు

క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న 339 మంది అకాడమిక్ ఇన్ స్ట్రక్చర్ ఉపాధ్యాయులకు సిఆర్టిలతో సమానంగా వేతనాలు చెల్లించాలని అకాడమిక్ ఇన్ స్ట్రక్చర్ ఉపాధ్యాయుల సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షులు రాజేందర్, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సురేందర్ నాయక్ పిలుపుమేరకు వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారికి జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్ధన్ కు సోమవారం వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుండి చాలీచాలని జీతాలతో ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఇన్ స్ట్రక్చర్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నామని, తక్కువ జీతంతో కుటుంబాన్ని పోషించలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. థర్డ్ పార్టీ వ్యవస్థను రద్దుచేసి సిఆర్టి లతో పాటు సమాన వేతనం అందించాలని వారు సూచించారు. ఏజెన్సీ నుండి10,300 రూపాయల జీతం తీసుకుంటూ కుటుంబాన్ని పోషించలేకపోతున్నామని వారు తెలిపారు. ప్రతి గిరిజన ఆశ్రమ పాఠశాలలో మూడో తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యను బోధిస్తున్నామని అన్నారు. ముఖ్యంగా డే డ్యూటీలు నైట్ డ్యూటీలు స్పెషల్ క్లాసులు ఇలా చేసుకుంటూ పాఠశాలలో పదవ తరగతిలో 100% ఉత్తీర్ణత తీసుకురావడానికి హర్నిశలు కృషి చేస్తున్నామని, అలాంటి మాకు తక్కువ జీతంతో పని చేయలేకపోతున్నామని వారి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను



ఉన్నత అధికారులకు ట్రైబల్ వెల్ఫేర్ మినిస్టర్ కు వినతి పత్రాలను ఫార్వార్డు చేయాలని కోరారు. లేనిపక్షంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 339 మంది అకాడమిక్ ఇన్ స్ట్రక్చర్స్ ఉపాధ్యాయులు ఐక్యతతో కూడి ఆగస్టు 17న నిరవధిక సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల కొత్తపల్లి బండ వెలికిచెర్ల తాండూరు రాంపూర్ బొంరేస్ పేట్ గిరిజన ఆశ్రమ పాఠశాలల ఇన్ స్ట్రక్చర్ ఉపాధ్యాయులు, రాజేందర్, పెంటయ్య, గజ్జి కృష్ణ, శ్రీకాంత్, రమేష్, మహిళా ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## బోల్ భమ్ ఉత్సవంలో పాల్గొన్న మాద్రి పృథ్వీరాజ్



పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 03: జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీలో ఉత్తర భారత, ఒడిశా వాసులు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన పవిత్ర బోల్ భమ్ ఆధ్యాత్మిక ఉత్సవంలో బీఆర్ఎస్ నాయకులు, ఎండీఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, భక్తులను కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన ఆయన, అన్ని సంస్కృతులు, అన్ని సంప్రదాయాలకు సమాన గౌరవం ఇవ్వడం భారతీయ సంస్కృతి గొప్పతనమని అన్నారు. భిన్న సంస్కృతులు, సంప్రదాయాలు సమాజానికి బలమని, పరస్పర గౌరవం, సామరస్యమే దేశ ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. సర్వమత సౌహార్ద్రాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలతో మమేకమై వారి మధ్యే సేవ చేయడం తన లక్ష్యమని మాద్రి పృథ్వీరాజ్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, భక్తులు, ఒడిశా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 67 వినతులు.. సత్వర పరిష్కారానికి కలెక్టర్ ఆదేశం

సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 03: ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదు, వినతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్దిష్ట రిమార్కులతో నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 67 ఫిర్యాదులు, వినతులు అందగా, వాటిలో కలెక్టరేట్‌లో 48, సంగారెడ్డి డివిజన్‌లో 8, జహీరాబాద్ డివిజన్‌లో 7, నారాయణఖేడ్ డివిజన్‌లో 4 వినతులు నమోదయ్యాయని తెలిపారు. అందోల్ డివిజన్‌లో ఎలాంటి ఫిర్యాదులు నమోదు కాలేదని పేర్కొన్నారు. అందిన వినతులు ప్రధానంగా రెవెన్యూ, హౌసింగ్, పెన్షన్లు, పంచాయతీరాజ్, నీటిపారుదల, కాలుష్య నియంత్రణ మండలి, కార్మిక, విద్య, ఆర్టీసీ, ఉపాధి కల్పన, మహిళా--శిశు సంక్షేమం, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖలకు సంబంధించినవని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంగారెడ్డి ఆర్డీఓ, కలెక్టరేట్ రెవెన్యూ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి శిశువుకు తొలి ఆహారం తల్లిపాలే: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 03: ప్రతి శిశువు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తల్లిపాలే తొలి, ఉత్తమ ఆహారమని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. శిశువు పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించాలని, పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలను తప్పనిసరిగా శిశువుకు అందించాలని సూచించారు. తల్లిపాలు సహజ రోగనిరోధక శక్తిని పెంచి, శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు బలమైన పునాది వేస్తాయని తెలిపారు. తల్లి--శిశువు మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేయడంలో తల్లిపాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి కుటుంబం తల్లిపాల ప్రాధాన్యతను గుర్తించి, తల్లిపాలపై అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జ్యోతి, జిల్లా మహిళా అండ్ శిశు సంక్షేమ అధికారి లలిత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితా దేవి, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, ఆర్డీఓ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.